


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 226 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 22 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE : 226 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 22 APRIL 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur



# సిట్ విచారణకు హాజరవుతున్నా

- ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి
- మరో ఆడియో సందేశం విడుదల
- నేడు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య సిట్ కార్యాలయానికి వస్తానని వెల్లడి






పెన్ పవర్ డెస్క్:ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆయన నేడు ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. (మంగళవారం) ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య సిట్ అధికారుల ముందు విచారణకు హాజరవుతానని వెల్లడించారు అంతకుముందు, ఇదే కేసులో ముందస్తు బెయిల్ కోసం రాజ్ కసిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇటీవల ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించడానికి నిరాకరించింది. ఆయన తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు తోసిపుచ్చింది. తదుపరి

వివరాలు 2లో..

## రాజ్ కసిరెడ్డిని అదుపులోకి తీసుకున్న ఏపీ సిట్ పోలీసులు

- మద్యం స్కాం కేసులో అత్యంత కీలక నిందితుడి ఉన్న రాజ్ కసిరెడ్డి
- దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన వైనం
- శంషాబాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి తీసుకున్న సిట్ పోలీసులు

# మరో భారీ ఎన్ కౌంటర్

- ఝూర్ఖండ్‌లో భారీ ఎన్ కౌంటర్.. పెద్ద సంఖ్యలో మావోలు మృతి
- బొకారో జిల్లా 'లుగు' కొండల్లో భారీ ఎన్ కౌంటర్
- ఎనిమిది మంది మావోలను కాల్చి చంపిన బలగాలు
- ఘటనా స్థలి నుంచి పలు ఆయుధాలు స్వాధీనం



పెన్ పవర్ డెస్క్:మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటివరకు చత్తీస్ గఢ్ లో వరుస ఎన్ కౌంటర్లు జరిగితే... తాజాగా ఇప్పుడు ఝూర్ఖండ్ కి సీన్ మారింది. ఝూర్ఖండ్ లోని బొకారో జిల్లా లాల్పాని యా ప్రాంతంలోని 'లుగు' కొండల్లో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఉదయం నుంచి ఆ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయి. సీఆర్పీఎఫ్ తో కలిసి రాష్ట్ర పోలీసులు నిర్వహించిన సంయుక్త ఆపరేషన్ లో ఎనిమిది మంది మావోయిస్టులు హతమయ్యారు. కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్టు సమాచారం. ఎన్ కౌంటర్ జరిగిన ఘటనాస్థలి నుంచి ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, రైఫిల్స్ వంటి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం

వివరాలు 2లో..

# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల నుంచి ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు ఉత్తర్వులు జారీ
- తెలంగాణ నుంచి జస్టిస్ సురేందర్ మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ శ్రీసుధ కర్ణాటక హైకోర్టుకు బదిలీ
- ఆంధ్రప్రదేశ్ నుంచి జస్టిస్ మన్మథరావు కర్ణాటక హైకోర్టుకు బదిలీ
- అధికారికంగా ఖరారైన న్యాయమూర్తుల బదిలీలు

వివరాలు 2లో..



# "నేను రాక్షసుడ్ని చంపేశాను'

## మాజీ డీజీపీ భార్య వీడియో కాల్!



- సంచలనం సృష్టించిన కర్ణాటక మాజీ డీజీపీ హత్య
- తన ఇంట్లోనే రక్తపు మడుగులో ఓం ప్రకాశ్
- హత్య అనంతరం స్నేహితురాలికి పల్లవి వీడియో కాల్!

పెన్ పవర్ డెస్క్:కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ (68) తన నివా సంలోనే దారుణ హత్యకు గురికావడం సంచలనం సృష్టించింది. బెంగళూరులోని హెచ్ఎస్ఆర్ లేఅవు ట్‌లోని ఆయన నివాసంలోనే ఈ ఘోరం చోటుచే సుకుంది. ఓం ప్రకాశ్ భార్య పల్లవి, కుమార్తె కృతి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. హత్య అనంతరం పల్లవి

వివరాలు 2లో..

# ఏపీ హైకోర్టులో వల్లభనేని వంశీకి నిరాశ

- స్థలం ఆక్రమణ కేసులో వంశీకి నిరాశ
- కేసును వారంపాటు వాయిదా వేసిన హైకోర్టు
- ఇప్పటికే విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీ



వివరాలు 2లో..

## చంద్రబాబుపై అభ్యంతరకర వ్యాఖ్యలు...

# వైసీపీ నేత రాజీవ్ రెడ్డి అరెస్ట్

- సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టేవారిపై ఉక్కుపాదం
- సొంత పార్టీ వారైనా కఠినంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- చంద్రబాబుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడినట్టు రాజీవ్ రెడ్డిపై ఫిర్యాదు



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం వచ్చాక సోషల్ మీడి యాలో తప్పుడు పోస్టులు పెట్టేవారిని, యూ ట్యూబ్ చానళ్లలో నోటికొచ్చినట్టు మాట్లాడే వారిని ఎంతమాత్రం ఉపేక్షించడంలేదు. సొంతపార్టీకి చెందిన వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటోంది. తాజాగా, సీఎం చంద్రబాబుపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన నెల్లూరు జిల్లా వైసీపీ నేత కాకుటూరు రాజీవ్ రెడ్డిని పోలీసులు నేడు అరెస్ట్ చేశారు. రాజీవ్ రెడ్డి చేజర్ల మండలం పాతపాడు గ్రామానికి చెందిన నేత. చంద్రబాబుపై సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలకు

వివరాలు 2లో..

# హైదరాబాద్‌లో ఈ-సిగరెట్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్, అమెరికన్ డాలర్లు సీజ్

- ఈ-సిగరెట్లు, వేప్‌లను విక్రయిస్తున్న ముఠా అరెస్టు
- యువత, విద్యార్థులే లక్ష్యంగా కార్యకలాపాలు
- వాట్సాప్‌లో ప్రత్యేక గ్రూప్‌తో విక్రయం
- నిందితుల నుంచి అమెరికన్, కెనడియన్ డాలర్లు స్వాధీనం



పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్ నగరంలో నిషేధిత ఈ-సిగరెట్లు (వేప్‌లు) అక్రమం గా విక్రయిస్తున్న ముఠాను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్) అధికారులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో యువత, విద్యార్థులే లక్ష్యంగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,

వివరాలు 2లో..

# జనసేన కీలక ప్రకటన

- జనసేన 'జనవాణి' కార్యక్రమం పని వేళల్లో మార్పు
- సోమవారం నుంచి గురువారం వరకు కార్యక్రమం
- ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- కొనసాగింపుగా సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు 'జనవాణి'
- కొత్త పని వేళలు అమల్లోకి వస్తాయని పార్టీ ప్రకటన




పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం, జనసే న అధినేత పవన్ కల్యాణ్ గతంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు 'జనవాణి' కార్యక్రమాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వివిధ సమస్యలతో ఈ జనవాణికి వచ్చిన ప్రజలను స్వయంగా జనసేనాని కలిసి వారి నుంచి

వివరాలు 2లో..

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

- రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూత
- వాటికన్‌లోని తన నివాసంలో సోమవారం ఉదయం తుదిశ్వాస
- గత కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న పోప్
- మృతిని అధికారికంగా ధ్రువీకరించిన వాటికన్ వర్గాలు
- మరణానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ సందేశం ఇచ్చిన పోప్



పెన్ పవర్ డెస్క్:రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది గౌరవించే క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూశారు. ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7:35 గంటలకు వాటికన్‌లోని తన నివాసమైన కాసా శాంటా మార్టాలో ఆయన తుది శ్వాస విడిచినట్లు వాటికన్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. గత కొంతకాలంగా పోప్ ఫ్రాన్సిస్ శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యుమోనియా, కిడ్నీ సంబంధిత అనారోగ్యాలతో బాధపడుతున్నారు.

వివరాలు 2లో..

# ఏఐతో భారీ నిరుద్యోగం తప్పదు: గేట్స్, ఒబామా



- ఏఐ వల్ల ఉద్యోగాలకు పెను ముప్పు: గేట్స్, ఒబామా ఆందోళన
- ఇది గత శతాబ్దంలో చూడని మార్పుగా అభివర్ణన
- వైద్యులు, టీచర్ల వంటి మేధస్సు AIతో సులభంగా లభ్యం: గేట్స్
- అన్ని రంగాలపై ఏఐ ప్రభావం, కోడింగ్ ఉద్యోగాలకూ ప్రమాదం: ఒబామా
- జీవనోపాధి మార్గాలపై పునరాలోచన తప్పనిసరి అని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మానవ జీవితంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్న తరుణంలో, దాని వల్ల ఉద్యోగ భద్రతకు ఏర్పడబోయే ముప్పుపై ప్రపంచ దిగ్గజాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఏఐ ప్రభావంపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే సంవత్సరాల్లో ఏఐ లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేస్తుందని, ఇది గత వందేళ్లలో ప్రపంచం చూడని

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కట్టడి చేయకుంటే కష్టమే

రాయలసీమ నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంట్రోల్ చేయాల్సి ఉంది. రాయలసీమలో గత ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. వైసీపీ అధినేత జగన్ కు పట్టున్న ప్రాంతమైన రాయలసీమలోనే ఆయనను దెబ్బకొట్టగలిగామన్న సంతృప్తి కూటమి పార్టీల అగ్రనేతల్లో ఎక్కువ సమయం మిగిలేట్లు కనిపించడం లేదు. రాయలసీమలో వచ్చే ఎన్నికల్లోనూ మంచి మెజారిటీ సాధించాలన్నా, జగన్ ను కట్టడి చేయాలన్నా చంద్రబాబు నాయుడు అక్కడి నేతలను కొందరిని కంట్రోల్లో చేయాల్సి ఉంటుంది. లేకపోతే పెద్దయెత్తున పార్టీ డ్యామేజీ అయ్యే అవకాశాలున్నాయి. రాయలసీమలో నేతలు తమ అడ్డాగా భావించి గిరిగీసుకుని మరీ తమ ప్రపంచంలోకి ఎవరూ రాకూడదని ఆంక్షలు విధిస్తున్నారు.

**ఆది అల్ట్రాటెక్ కంపెనీ...**

నిన్నగాక మొన్న బీజేపీకి చెందిన జమ్మలమడుగుకు చెందిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరులు అల్ట్రాటెక్ కంపెనీ నుంచి లారీలను వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ కంపెనీలో ఏ కాంట్రాక్టు పనైనా తమకే అప్పగించాలన్న షరతును ఆది పెట్టారు. లారీలను అడ్డుకోవడంతో కంపెనీ ప్రొడక్షన్ పై ప్రభావం పడింది. దీంతో జిల్లా కలెక్టర్ సీరియస్ అయి ఆదినారాయణరెడ్డి అనుచరులు పదకొండు మంది పై కేసులు నమోదు చేయించారు. గతంలోనూ ఫ్లై యాష్ వివాదంలో ఆదినారాయణరెడ్డి, తాడిపత్రిమున్సిపల్ ఛైర్మన్ జేసీప్రభాకర్ రెడ్డిల మధ్య వివాదం ముదిరింది. ఇద్దరూ తమకే కావాలంటూ పట్టుబట్టడం చంద్రబాబుకు తలనొప్పిగా మారింది. ఈ వివాదం కూడా పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ఉంది.

**తిప్పనివ్వనంటూ...**

తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డి మరొక అడుగు ముందుకు వేసి ప్రయివేటు బస్సుల యజమానులకు వార్నింగ్ ఇచ్చారు.. హైదరాబాద్ లో జరిగిన ప్రయివేటు బస్సు ఓనర్ల సమావేశానికి తనను పిలవకపోవడంపై జేసీ ప్రభాకర్ రెడ్డి గుర్రుగా ఉన్నారు. తనను ఆహ్వానించకుండా బస్సు ఓనర్లు సమావేశం ఎలా నిర్వహిస్తారంటూ ప్రశ్నించారు. తాను కూడా ప్రయివేటు బస్సు ఓనరేనని గుర్తులేదా? అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి నిలదీశారు. ప్రభుత్వానికి బస్సులు లీజు కు ఇస్తే అనంతపురంలో ఎలా నడుపుతారో చూస్తానంటూ బహిరంగంగా వార్నింగ్ ఇచ్చారు. తమ ఇలాకాలో లీజుకు ఇచ్చిన ప్రయివేటు బస్సులు తిరగడానికి లేదంటూ ఆంక్షలు విధించారు.

**హెచ్చరికలతో పాటు...**

తాను ఎప్పటి నుంచో ప్రయివేటు బస్సులను నడుపుతున్నానని, సమావేశానికి తనను పిలవకపోయినా పరవాలేదు కానీ, ఎవరెవరో తమకు ఇష్టం వచ్చినట్లు బస్సులు తిప్పుదామంటే ఊరుకునేది లేదని జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. బస్సులు లీజుకు ఇస్తే తిరగనిస్తామని అనుకోవడం మంచి పద్ధతి కాదనంటూ జేసీ ఒక రకంగా ప్రయివేటు బస్సుల యాజమాన్యానికి హుకుం జారీ చేశారు. ఇలా తమ ఇలాకాలోకి వేరెవరిని రానివ్వకుండా తామే వ్యాపారాలు చేసుకుంటామంటూ నేతలు హెచ్చరిస్తుండటంతో పార్టీలకు తలనొప్పిగా మారింది. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని ఈ ఇద్దరిని కంట్రోల్ చేయాలని కోరుతున్నారు. లేకుంటే సీమలో ఈ ప్రభావం వచ్చే ఎన్నికల ఫలితాలపై పడుతుందని హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల నుంచి ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులలో పనిచేస్తున్న ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ జరిగింది. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ బదిలీలను ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల ప్రకారం, తెలంగాణ నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక న్యాయమూర్తి ఇతర రాష్ట్రాల హైకోర్టులకు బదిలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టులో సేవలందిస్తున్న న్యాయమూర్తులలో జస్టిస్ కె. సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీసుధను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ కె. మన్మథరావును కూడా కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేశారు. ఈ బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం గతంలో సిఫార్సులు చేసింది. తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఈ ప్రక్రియ పూర్తయింది. బదిలీ అయిన న్యాయమూర్తులు త్వరలో తమ కొత్త బాధ్యతలను స్వీకరించే అవకాశం ఉంది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు హేమంత్ చందన్ గౌడ్‌ను మద్రాస్ హైకోర్టుకు, కృష్ణన్ నటరాజన్‌ను కేరళకు, సంజయ్ గౌడ్‌ను గుజరాత్‌కు, దీక్షిత్ శ్రీకృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేశారు.

# “నేను రాక్షసుడ్ని చంపేశాను’

- మొదటి పేజీ తరువాయి

తన స్నేహితురాలికి వీడియో కాల్ చేసి, “నేను రాక్షసుడిని చంపేశాను” అని చెప్పినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు పల్లవితో పాటు వారి కుమార్తె కృతిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కళ్లల్లో కారం, కత్తితో దాడి.. హత్య వెనుక కుటుంబ కలహాలు? పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, ఆదివారం ఓం ప్రకాశ్, పల్లవిల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సహనం కోల్పోయిన పల్లవి, ముందుగా ఓం ప్రకాశ్ ముఖంపై కారం చల్లి, అనంతరం కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసినట్లు తెలుస్తోంది. వారి మూడు అంతస్తుల ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో రక్తపు మడుగులో పడి ఉన్న ఓం ప్రకాశ్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ దారుణ హత్య వెనుక దీర్ఘకాలంగా కొనసాగుతున్న కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు (ముఖ్యంగా కర్ణాటకలోని దాండేలిలో ఉన్న భూ వివాదం) ప్రధాన కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. పల్లవి గత కొంతకాలంగా మానసిక సమస్యలతో (స్కిజోఫ్రెనియా) బాధపడుతున్నారని, చికిత్స తీసుకుంటున్నారని కూడా పోలీసు వర్గాలు వెల్లడించాయి. గతంలో కుటుంబ గొడవలపై ఫిర్యాదు చేసేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, తన ఫిర్యాదును సరిగా స్వీకరించలేదని ఆరోపిస్తూ అక్కడే నిరసనకు దిగినట్లు సమాచారం.

**ఓం ప్రకాశ్ నేపథ్యం**

బీహార్‌కు చెందిన ఓం ప్రకాశ్, 1981 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. కర్ణాటక కేడర్‌లో అదనపు ఎస్పీగా కెరీర్ ప్రారంభించి, పలు జిల్లాల్లో ఎస్పీగా,

లోకాయుక్త, అగ్నిమాపక శాఖల్లో ఉన్నత పదవులు నిర్వహించారు. 2015 మార్చి నుంచి 2017 మార్చి వరకు కర్ణాటక డీజీపీ, ఐజీపీగా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఈ హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతోంది. పోలీసులు పల్లవి, కృతిలను విచారిస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదిక, తదుపరి విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# రాజ్ కసిరెడ్డిని అదుపులోకి తీసుకున్న ఏపీ సిట్ పోలీసులు

ఏపీ లిక్కర్ స్కాం కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అత్యంత కీలక నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణకు సమయం పట్టొచ్చు ఉండడంతో రేపు సిట్ విచారణకు హాజరవుతున్నానని రాజ్ కసిరెడ్డి స్వయంగా వెల్లడించిన కాసేపటికే, అతడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఏపీ సిట్ పోలీసులు అతడిని హైదరాబాదులోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. రాజ్ కసిరెడ్డి దుబాయ్ నుంచి హైదరాబాద్ రాగా, పోలీసులు పక్కా సమాచారంతో అతడిని పట్టుకున్నట్లు సమాచారం. ఏపీ పోలీసులు రాజ్ కసిరెడ్డిని కాసేపట్లో విజయవాడ తీసుకురానున్నారు.

## సిట్ విచారణకు హాజరవుతున్నా

- మొదటి పేజీ తరువాయి

విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. కాగా, సిట్ అధికారులు గతంలో మూడు పర్యాయాలు నోటీసులు ఇచ్చినా రాజ్ కసిరెడ్డి విచారణకు హాజరు కాలేదు. తాజాగా హైకోర్టులోనూ ఊరట లభించకపోవడం, కోర్టులో విచారణ ఆలస్యం అవుతుండడంతో ఆయన సిట్ ఎదుటకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇదే కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత విజయసాయిరెడ్డి సిట్ విచారణకు హాజరైన అనంతరం కూడా రాజ్ కసిరెడ్డి ఒక ఆడియో విడుదల చేశారు. తనపై విజయసాయిరెడ్డి ఆరోపణలు చేసినప్పటికీ, బెయిల్ పిటిషన్ కోర్టు పరిధిలో ఉన్నందున తాను స్పందించడం లేదని ఆ సందేశంలో పేర్కొన్నారు. త్వరలోనే విజయసాయిరెడ్డి బండారం బయటపెడతానని హెచ్చరించారు. ఇప్పుడు న్యాయస్థానంలో అనుకూల నిర్ణయం రాకపోవడంతో సిట్ విచారణను ఎదుర్కోవడానికి సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

- మొదటి పేజీ తరువాయి

ఈ కారణంగా ఫిబ్రవరిలో ఆసుపత్రిలో చేరి 38 రోజుల పాటు చికిత్స పొంది, గత నెలలోనే డిశ్చార్జ్ అయ్యారు. అర్జెంటీనాలో జన్మించిన ఆయన, దక్షిణ అమెరికా నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ప్రజల పోప్‌గా పేరుగాంచిన ఆయన, సామాజిక అంశాలపై తన గళం వినిపించేవారు. ఆశ్చర్యకరంగా, మరణించడానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ పర్వదినాన సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో వేలాది మంది భక్తులకు ఆయన సందేశం ఇచ్చారు. అనారోగ్యం తర్వాత అంతమంది ప్రజల మధ్యకు రావడం అదే తొలిసారి. ఆయన మృతితో ప్రపంచవ్యాప్తంగా కేథలిక్ సమాజం విషాదంలో మునిగిపోయింది. కార్డినల్ ఫారెల్ ఆయన మృతిని ప్రకటిస్తూ, పోప్ ఫ్రాన్సిస్ జీవితం ప్రభువుకు, చర్చికి సేవ చేయడానికే అంకితమైందని పేర్కొన్నారు.

# జనసేన కీలక ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

వినతి పత్రాలను తీసుకుని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో తాజాగా జనసేన ఈ కార్యక్రమం నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకుంది. వేసవి కాలం నేపథ్యంలో ‘జనవాణి’కి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఈ కార్యక్రమం పనివేళలను మార్చినట్లు పార్టీ ప్రకటించింది. ఇకపై సోమవారం నుంచి గురువారం వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, కొనసాగింపుగా సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ కొత్త పని వేళలు ఇవాళ్టి (ఏప్రిల్ 21) నుంచి అమల్లోకి వస్తాయని జనసేన తెలిపింది. ఈ మేరకు మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

# ఏఐతో భారీ నిరుద్యోగం తప్పదు: గేట్స్, ఒబామా

- మొదటి పేజీ తరువాయి

అతిపెద్ద మార్పు కానుందని వారు స్పష్టం చేశారు. బిల్ గేట్స్ మాట్లాడుతూ, ప్రస్తుతం అరుదుగా లభించే మేధస్సు (ఉదాహరణకు గొప్ప వైద్యులు, ఉపాధ్యాయుల నైపుణ్యం) ఏఐ సహాయంతో రాబోయే దశాబ్ద కాలంలో ఉచితంగా, సర్వసాధారణంగా అందుబాటులోకి వస్తుందన్నారు. “ఇది వైద్య సలహాలు, ట్యూటరింగ్ వంటి అనేక సమస్యలను పరిష్కరిస్తుంది. అయితే, ఇది ఉద్యోగాల స్వరూపాన్ని, పని విధానాలను పూర్తిగా మార్చివేస్తుంది. వారానికి రెండు, మూడు రోజులు పనిచేస్తే సరిపోతుందేమో” అని ఆయన అభిప్రాయపడ్డారు. ఏఐ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళుతుందని అంగీకరిస్తూనే, దానివల్ల కలిగే మార్పులు కొంత భయానకంగా ఉన్నాయని గేట్స్ వ్యాఖ్యానించారు. మరోవైపు, బరాక్ ఒబామా మాట్లాడుతూ, ఏఐ సాంకేతికత గతంలోని అన్ని టెక్నాలజీ మార్పుల కంటే వేగంగా, మరింత ప్రభావవంతంగా ఉండబోతోందని హెచ్చరించారు. “ఇది కేవలం తయారీ రంగంలోని ఆటోమేషన్ లాంటిది కాదు. ఉన్నత స్థాయి మేధోపరమైన పనులను కూడా ఏఐ చేయగలదు. ఇప్పటికే చాలా మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్‌ల కంటే మెరుగ్గా ఏఐ కోడింగ్ చేయగలుగుతోంది. సిలికాన్ వ్యాలీలో మంచి జీతాలతో ఉన్న ఉద్యోగాలు కూడా ప్రమాదంలో పడతాయి” అని ఒబామా వివరించారు. అత్యున్నత నైపుణ్యం గల నిపుణులు ఏఐని తమ పనిని మెరుగుపరుచుకోవడానికి ఉపయోగిస్తారని, కానీ సాధారణ స్థాయి ఉద్యోగాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఒబామా అన్నారు. “కేవలం కార్మికులు, ఫ్యాక్టరీ ఉద్యోగులే కాదు, ఇప్పుడు అందరూ ‘ఉద్యోగం ఎలా సంపాదించాలి? కుటుంబాన్ని పోషించుకోవడానికి ఆదాయం ఎలా పొందాలి?’ అని ఆలోచించాల్సిన పరిస్థితి వస్తుంది. మనం ఎంతో ఉత్పత్తి చేస్తున్నప్పుడు, దాన్ని ఎలా పంపిణీ చేయాలి? జీవితంలో మన పరమార్థం ఏమిటి? అనే ప్రశ్నలను మనమందరం ఎదుర్కోవాల్సి ఉంటుంది” అని ఒబామా నొక్కిచెప్పారు.

## చంద్రబాబుపై అభ్యంతరకర వ్యాఖ్యలు...
# వైసీపీ నేత రాజీవ్ రెడ్డి అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

పాల్పడినట్టు అతడిపై కేసు నమోదైంది. స్థానిక నేతల ఫిర్యాదుతో పోలీసులు రాజీవ్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

## ఏపీ హైకోర్టులో వల్లభనేని
# వంశీకి నిరాశ

**పెన్ పవర్ డెస్క్:** స్థలం ఆక్రమణ కేసులో వైసీపీ నేత వల్లభనేని వంశీకి ఏపీ హైకోర్టులో నిరాశ ఎదురయింది. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను హైకోర్టు ఈరోజు విచారించింది. కేసుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో, కేసును హైకోర్టు వారంపాటు వాయిదా వేసింది.

ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి విజయవాడ జైల్లో వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వంశీపై ఈ కేసుతో పాటు గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన కేసు, సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసిన కేసు కూడా ఉన్నాయి. ఈ మూడు కేసుల్లో ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# హైదరాబాద్‌లో ఈ-సిగరెట్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్, అమెరికన్ డాలర్లు సీజ్

- మొదటి పేజీ తరువాయి

ఈ ముఠా సభ్యులు నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలల వద్ద యువతను ఆకర్షించి వారికి ఈ-సిగరెట్లు, వేపింగ్ పరికరాలను విక్రయిస్తున్నారు. ఇందుకోసం ‘ఎస్ఐడీ’ అనే పేరుతో ఒక ప్రత్యేక వాట్సప్ గ్రూప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ గ్రూప్ ద్వారా సుమారు 500 మందికి పైగా వినియోగదారులకు ఈ నిషేధిత ఉత్పత్తులను సరఫరా చేస్తున్నారని అధికారులు గుర్తించారు. అరెస్టయిన నిందితులు హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రాంతానికి చెందిన అన్నదమ్ములుగా పోలీసులు గుర్తించారు. వీరికి ఢిల్లీకి చెందిన అమిత్, ముంబైకి చెందిన వసీం అనే వ్యక్తులు ప్రధాన సరఫరాదారులుగా వ్యవహరిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా ఈ నిషేధిత ఉత్పత్తులను నగరానికి తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి సుమారు రూ. 25 లక్షల విలువైన ఈ-సిగరెట్లు, వేపింగ్ పరికరాలు, వాటికి సంబంధించిన లిక్విడ్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 225 అమెరికన్ డాలర్లు, 100 కెనడియన్ డాలర్ల విదేశీ కరెన్సీని కూడా సీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# మరో భారీ ఎన్ కౌంటర్

- మొదటి పేజీ తరువాయి

చేసుకున్న బలగాలు వాటిని అక్కడి నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మావోయిస్టుల ఉనికి లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. మావోయిస్టులందరూ లొంగిపోవాలని... లేకపోతే ప్రాణాలతో మిగిలి ఉండరని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెచ్చరించిన సంగతి విదితమే. ఈ ఎన్ కౌంటర్ కు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# కాణిపాకం స్వామి వారి హుండీ లెక్కింపు



**కాణిపాకం /పెన్ పవర్/ఏప్రిల్ 21 :** కాణిపాకం వారి హుండీ లెక్కింపు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి హుండీ లెక్కింపు ద్వారా 24 రోజులకు రాబడిన ఆదాయం 1,71,77,943 రూపాయలు,బంగారం 165.గ్రాములు,వెండి 1, కిలోల 350 గ్రాములు,గో సంరక్షణ హుండీ ద్వారా 13,814 రూపాయలు.నిత్య అన్నదానం హుండీ ద్వారా 42,436 రూపాయలు.ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ 309. డాలర్స్. ఆస్ట్రేలియా- 5. డాలర్స్. కెనడా - 50 డాలర్స్. మలేషియా- 4. రింగ్గిట్స్ . యూరో 10. యుఏఈ 135. ధీరమ్స్.ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెంచల కిషోర్ తెలిపారు, ఈ హుండీ లెక్కింపులో పాల్గొన్నవారు, ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు-కోదండపాణి, శ్రీధర్ బాబు, హుండీ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## భూ సమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండాతో

# ముందుకు సాగుతున్నాం

**జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి శ్రీకారంచుట్టాం : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**



**పలమనేరు,ఏప్రిల్ 21, (పెన్ పవర్) :** భూ సమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండా ముందుకు వెళుతున్నామని, పలమనేరు డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి రానున్న మూడు నెలల పాటు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ ఉంటుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పలమనేరు ఆర్డిఓ కార్యాలయంలో పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు,పలమనేరు శాసన సభ్యులు ఎన్.అమర నాథ్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి,డిఆర్ఓ కె.మోహన్ కుమార్ లు లో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుండి అందుతున్న వినతులలో దాదాపు 95 శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. ఇందులో డికెటి, కుటుంబ తగాదాలు, ఆర్.ఓ.ఆర్,ఆన్ లైన్ రికార్డులలో సమస్యలు ఉన్నాయని,ఈ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని,క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. న్యాయపరమైన చిక్కులు,కుటుంబ తగాదాల నేపథ్యంలో వినతుల పరిష్కారం ఆలస్యం అవుతుందన్నారు. రానున్న మూడు నెలలు పలమనేరు, పుంగనూరు నియోజకవర్గంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ముఖ్యంగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చూపడం జరుగుతుందన్నారు. వినతుల పరిష్కారానికి అధికారులకు సరిపడా సమయం ఇస్తున్నామని తరువాయి 6లో..

# మాది రైతు ప్రభుత్వం : మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**బనగానపల్లె పెన్ పవర్ ఏప్రిల్ 21 :** రైతు అనుకూల ప్రభుత్వం.. రైతుల సంక్షేమం కోసం ఏదైనా చేయడానికి మా కూటమి ప్రభుత్వం సిద్ధమని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట్లలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2024-25 కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సన్న, చిన్నకారు రైతులకు రాయితీపై వ్యక్తిగత వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. గత ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత వ్యవసాయానికి ఇస్తోందన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం.. బాగుంటదనే ఆలోచనతో, వారికి చేదోడు వాదోడు ఉండేందుకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సబ్సిడీకి అందిస్తున్నామన్నారు. చంద్రబాబు నాయకత్వంలో వ్యవసాయ పంటల ఉత్పాదకత పెంచాలనే ఆలోచనతో మా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

గత ప్రభుత్వంలో అన్నదాతలకు జరిగిన అన్యాయం మళ్లీ పునరావృతం కాకూడదనే ఆలోచనతో మా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 2014-19 మధ్య ప్రత్యేకంగా రాష్ట్రంలో భూసార పరీక్షలు చేస్తే.. గత ప్రభుత్వంలో ఎక్కడా భూసార పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. రైతుల పంట మార్పిడి అంశాన్ని పట్టించుకోకుండా, ఒకే పంటను మూస ధోరణిలో వేయడం వల్ల నష్టాల పాలవుతున్నారన్నారు. మన పంట భూములను పరిశీలించిన అనంతరం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే, రైతే.. రాజు అవుతాడన్నారు. వ్యవసాయాధికారులు సూచనలు ఖచ్చితంగా పాటించాలని రైతులకు మంత్రి విన్నవించారు. గత ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క రోజు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు ఇచ్చిన దాఖలా ఎక్కడా లేదన్నారు. వీలైనంత తక్కువ ధరకే ఆయా పరికరాలు రైతులకు సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు డిమాండ్ ఆధారంగా భవిష్యత్తులో మరింత ఎక్కువ మంది రైతులకు అందజేస్తామన్నారు. అవసరమైతే గౌరవ వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడి నియోజకవర్గంలో రైతులకు అవసరాల మేరకు యాంత్రీకరణ పరికరాలు అందించే ప్రయత్నం చేస్తామన్నారు. గతంలో తరువాయి 6లో..

# కాల్షియం కార్బైడ్ వాడకం నిషేదం : జాయింట్ కలెక్టర్. జి విద్యాధరి



**చిత్తూరు పెన్ పవర్ ఏప్రిల్ 21 :** ప్రజల ఆరోగ్య దృష్ట్యా మామిడి కాయలను పండుబారించేందుకు వినియోగించే కాల్షియం కార్బైడ్ అమ్మడం, నిల్వ చేయడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, తనిఖీలో పట్టుబడితే సెక్షన్ 44 (ఏ) ప్రకారం 3 సం.ల జైలు శిక్షతో పాటు రూ.1000లు జరిమానా విధించబడునని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి కాయలను కోసిన తర్వాత పండుగా మారడానికి సహజంగా వారం రోజులు పడుతుందని, కానీ కోసిన వెంటనే పండుబారించడానికి కాల్సియం కార్బైడ్ (CaC2) అనే రసాయనాన్ని వినియోగించడం వల్ల మామిడి కాయలు రంగు వృద్ధి చెంది మెత్తగా మారుతాయి తప్ప పండు లోపల చక్కెరలు వృద్ధి చెందవని, ఫలితంగా మామిడి కాయలు పండు బారినా నాణ్యతగా వుండవన్నారు. కాల్సియం కార్బైడ్ వినియోగించి పండుబారించిన పండ్లు తినడం వల్ల కాల్షియం కార్బైడ్ విడుదల చేసిన ఆరసినిక్ యాసిడ్ రసాయనం వల్ల మనుషులలో కాలేయం, మూత్రపిండాల సమస్యలు, వాంతులు, విరేచనాలు, మత్తుగా ఉండడం, గుండెజబ్బులు, కడుపులో పుండ్లు మొదలగు సంబంధిత వ్యాధులతో బాటు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉండడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాల్షియం కార్బైడ్ వాడకాన్ని జి.ఓ.ఆర్.టి నెం. 288 తేది :19.03.2012 ద్వారా నిషేధించడం జరిగిందన్నారు. కనుక కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని, వ్యాపారస్తులు, రైతులు, చిరు వ్యాపారస్తులు ఎవ్వరూ పండుబారించడానికి వినియోగించరాదన్నారు. నిషేదిత కాల్షియం కార్బైడ్ వాడినట్లు తెలిసినా, నిల్వచేసినా, రవాణా చేస్తూ పట్టుబడినా చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు కాల్షియం కార్బైడ్ అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. కాల్షియం కార్బైడ్‌కు ప్రత్యామ్నాయంగా ఎథిలీన్ గ్యాస్ గాని ఎత్రెల్ ద్రావణం గాని ఉపయో గించి పండుబారించుకోవచ్చని, రైపనింగ్ ఛాంబర్లు ఏర్పాటు చేసుకుని ఎథిలీన్ గ్యాస్ ద్వారా మామిడి కాయలు పండు బారించుకోవడానికి చట్ట ప్రకారం అనుమతి ఉందని, వీటితో అత్యంత నాణ్యమైన పండ్లు లభిస్తాయన్నారు. ఎత్రెల్ ద్రావణం వాడేటప్పుడు కేవలం 100 పిపిఎం (1 మి.లీ 100 లీటర్ల నీటికి చొప్పున) మాత్రమే వినియోగించి పండుబారించాలని, కాల్షియం కార్బైడ్ వినియోగిస్తున్నట్లైతే మున్సిపల్ కమిషనర్ లేదా ఉద్యాన శాఖాధికారులు లేదా పంచాయతీ సెక్రెటరీ లేదా మార్కెటింగ్ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. మార్కెట్, మామిడి యార్డులలో అధికారులకు తనిఖీ చేసే అధికారం ఉండడంతో పాటు అవసరమైతే ఫుడ్ ఇన్స్పెక్టర్ శ్యాంపిల్‌లు సేకరించి అందులో నిషేదిత రసాయ నాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## పర్వతారోహకుడు సురేష్ బాబుకు ప్రోత్సహం



**కర్నూలు పెన్ పవర్, ఏప్రిల్ 21 :** నేపాల్ దేశంలో ఉన్న ప్రపంచంలోనే ఎత్తైన 7వ శిఖరం ధౌలగిరి శిఖరం అధిరోహించేందుకు భారతదేశంలోనే అతి చిన్న వయసు పర్వతారోహకుడైన సురేష్ బాబు అనే వ్యక్తికి ప్రోత్సాహంగా లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జియోమైసూర్ కంపెనీ సిఎస్ఆర్ నిధుల కింద ఆర్థిక సాయం అందచేసిందని కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సురేష్ బాబుకు లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా గోనెగండ్ల గ్రామ నివాసి అయిన 25 సంవత్సరాల వయస్సు ఉన్న సురేష్ బాబు చిన్న వయసులోనే ప్రపంచంలోని ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించారని, ఇప్పటివరకు ఇతడు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 25 శిఖరాలు అధిరోహించడమే కాకుండా అతి తక్కువ సమయంలోనే మనకున్న 7 ఖండాలలో 5 ఖండాలలోని ఎత్తైన శిఖరాలను అధిరోహించి, తక్కువ సమయంలోనే ఎక్కువ పర్వతాలు అధిరోహించిన వ్యక్తిగా రికార్డ్ సృష్టించడం అభినందనీయమన్నారు. అతనిలో ఉన్న ప్రతిభను గురించి ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయం అందించిందిన జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, పొల్యూషన్ కిషోర్ రెడ్డి, జియో మైసూర్ కంపెనీ ప్రతినిధి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### పేదవాళ్లు ఇచ్చిన అర్జీలకు

# పరిష్కారం త్వరితగతిన చూపించాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**





**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** పేదవాళ్లు ఇచ్చిన అర్జీలు చాలా పవిత్రమైనవని, అర్జీలకు గౌరవం ఇచ్చి తగిన పరిష్కారం త్వరితగతిన చూపించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ మరియు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కు సంబంధించి తాను క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందని, అయితే పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారం తగిన విధంగా లేదని, సరైన ప్రణాళిక ప్రకారం అర్జీలను ఎవరికి రాశామో ఆ అధికారికే వెళ్లేలా చూడాలన్నారు. తాను క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్ళినప్పుడు ఇచ్చిన అర్జీలు, చాంబర్ వద్ద ఇచ్చిన అర్జీలను పిజిఆర్ఎస్‌లో ఈ-ఫైల్ చేసి ఎక్కించాలని, వాటికి ఈ ఫైల్ నెంబర్ ఇవ్వాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ సభ్యులు, పీజిఆర్ఎస్ సిబ్బంది ఒక వ్యవస్థ ఏర్పాటు చేసుకొని సమస్యకు పరిష్కారం ఇవ్వాలన్నారు. అర్జీలకు ఎలాంటి పరిష్కారం చూపించలేదు అనేది ఎక్కడా ఉండరాదని, వచ్చిన అర్జీకి సంబంధించి ఏ అధికారికి ఎండార్స్ చేసామో ఆ అధికారికి పంపించాలని, దీనిని రోజు ఫాలో అప్ చేయాలన్నారు. వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కారం చేయాలన్నారు. వచ్చేవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల అధికారులు, ఆయా శాఖల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు అధికారులంతా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో సిపిఓ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిటిసి వీర్రాజు, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్, పిజిఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు సహాయ ఉపకరణాలు పంపిణీ



**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఎన్నో ప్రోత్సాహాలు ఇస్తుందని, ఈ అవకాశాన్ని సంబంధిత తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని పిల్లల భవిష్యత్తుకు అండగా ఉండాలని తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక బైరాగిపట్టెడ నందు ఎంజీఎం హైస్కూల్ నందు విద్యాశాఖ మరియు సర్వ శిక్షా అభియాన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సహాయ ఉపకరణాలను పంపిణీ కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సుమారు 3600 మంది ఉన్నారని, వారి భవిష్యత్తు కోసం కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. ప్రతి మండలంలో ఒక భవిత పాఠశాలు కలవని, మొత్తం 34 భవిత పాఠశాలలో ఉన్నాయని అన్నారు. ఈ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సాధారణ విద్యార్థులు లాగా విద్యను అభ్యసించే అవకాశం ఉండదు కనుక అలాంటి విద్యార్థుల కోసం భవిత పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. భవిత పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఉపకరణాలు , పరికరాలు తో పాటు టీచర్లను నియమించడం జరిగిందని తెలిపారు. ఈరోజు 421 మందికి ట్రై సైకిల్స్ , హీరింగ్ కిట్స్ విల్ చైర్స్ , రోలేటర్స్, బ్రెయిలీ కిట్స్ వంటి పరికరాలను అందించడం జరిగిందనీ, మిగిలిన ఉపకరణాలు కూడా త్వరలో అందిస్తామని తెలిపారు.

గతంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు రవాణా ఖర్చులకోసం నెలకు రూ.3000 ఉండేదని ప్రస్తుతం రూ .6000 విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సొంతంగా పాఠశాలలకు వెళ్ళలేని పిల్లల కోసం ఎస్కార్ట్ ద్వారా వెళ్లే పిల్లలకు కూడా నెలకు రూ.6000 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆడపిల్లల కోసం నెలకు ఇచ్చే రూ. 6000 రూపాయలు కాకుండా ప్రత్యేక స్టైఫండ్ అలవెన్స్ కింద అదనంగా రూ. 2000 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. భవిత పాఠశాలలకు వెళ్ళలేని పరిస్థితిలో ఉన్న పిల్లల కూడా ఇంటి దగ్గరే పాటలు చెప్పడం జరుగుతుందని వారికి కూడా నెలకి రూ. 3000 ఇస్తున్నారని అన్నారు. మిగతా పిల్లలు లాగే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు వెళ్ళగలరని తల్లిదండ్రులు వారి పిల్లలకి అండగా ఉండి వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రోత్సహించాలని అన్నారు. ఇలాంటి పిల్లల కోసం తల్లిదండ్రులతోపాటు రాష్ట్ర ప్రభుత్వస్త కూడా అండగా ఉంటుందన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వివిధ కేటగిరీ కింద పెన్షన్లు అందిస్తున్నామని, అలాగే పరికరాల కూడా అందించడం వలన సమాజంలో మిగతా పిల్లలు లాగా గుర్తింపబడతారని తెలిపారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జిల్లా సమగ్ర శిక్ష సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో ఈ రోజు 421 మందికి ట్రై సైకిల్స్, మోటార్ సైకిల్, హియరింగ్ కిట్స్, బ్రెయిలీ కిట్స్ తదితర ఉపకరణాలను ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అందజేయడం జరిగిందని తెలిపారు.

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ అభివృద్ధి కోసం ముందు చూపుతో విద్యాశాఖలో పెనుమార్పులు తీసుకొని వచ్చి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పాఠశాలకు వెళ్ళి విద్యను అభ్యసించలేని వారి కోసం ఇంటి దగ్గర నుంచి పాఠాలు నేర్పించి వారి తల్లిదండ్రుల సహాయంతో వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఈ కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే తో కలిసి జిల్లా కలెక్టర్ విద్యార్థులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల తల్లిదండ్రులు ఉపకరణాలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ విద్యాశాఖ అధికారి బాలాజీ, ఇంక్లూజివ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం ముని శారద, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్

# పెండిగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్**





**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్‌లోని సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సంబంధిత అధికారులతో కలిసి వైజాగ్ చెన్నైఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులలో భాగమైన పలు ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించిన భూసేకరణ పనులు, రోడ్లు తదితర అంశాలపై విసిఐసి, రెవెన్యూ, ఏపీఐఐసీ, ఆర్అండ్‌బి శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కు అభివృద్ధి పనులకు సంబంధించిన సంబంధించి నాయుడుపేట, మేనకూరు మండలాలకు సంబంధించిన ఏడు గ్రామాలలో భూ సేకరణ పెండింగ్, రోడ్లు పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ మధుసూదన్ రావు, సంబంధిత మండలాల తాసిల్దారు, తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 23న పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల

**కడప, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** మార్చి 2025 ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల ఫలితాలు మరియు ఓపెన్ స్కూల్ పదో తరగతి & ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ఫలితాలు 23-04-2025న ఉదయం 10.00 గంటలకు విడుదల చేయనున్నారు. అభ్యర్థుల ఫలితాలు https://bse.ap.gov.in, https://apopenschool.ap.gov.in/ వెబ్ సైట్లు, 'మన మిత్ర' (వాట్సాప్), LEAP మొబైల్ యాప్‌లలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. వాట్సాప్‌లో 9552300009 నంబర్‌కు "Hi" అని మెసేజ్ పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని, వారి రోల్ నంబర్‌ను నమోదు చేయడం ద్వారా వారి ఫలితాల పిడిఎఫ్ కాపీని పొందవచ్చు. అలానే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. LEAP మొబైల్ యాప్ ఉపాధ్యాయులు, విద్యార్థుల లాగిన్‌ల ద్వారా కూడా ఫలితాలు పొందే సౌలభ్యం కల్పించారు.

## ప్రపంచ మలేరియా దినోత్సవం : కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్




**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** ఏప్రిల్ నెల 25వ తేదీన జరుగనున్న ప్రపంచ మలేరియా దినోత్సవం పోస్టర్స్, బ్యానర్స్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాల కృష్ణ నాయక్‌తో కలిసి ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రపంచ మలేరియా దినోత్సవం ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు అని అన్నారు. మలేరియా వ్యాధి నిర్మూలన, ప్రజలలో ఈ వ్యాధి పట్ల అవగాహనా కలిపించడం ఈ దినోత్సవ ముఖ్యోద్దేశ్యం అని తెలిపారు. ప్రజలంతా మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. దోమలు వ్యాపి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు అని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్, Dchs Dr ఆనంద మూర్తి, వైద్యాధికారి డా.అభిజ్ఞ, శ్రీ బాబూ నెహ్రూ రెడ్డి హెచ్చిఓ, మరియు సబ్ యూనిట్ అధికారులు, మలేరియా ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీలను స్వీకరించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి



**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** సోమవారం జిల్లా సచివాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ, వెంకట శివ, చిత్తూరు ఆర్డీ ఓ శ్రీనివాసులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## త్రైమాసిక లక్ష్యాల ప్రణాళికను అమలు చేయాలి

### - కలెక్టర్ పి.రంజిత్ భాష





**కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 21 :** పంటల సాగు, సాంకేతికత, నీటి సంరక్షణ అంశాల్లో సమగ్రాభివృద్ధితో ఆదర్శ గ్రామాన్ని తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష అన్నారు. పీపీపీ మోడ్‌లో జిల్లా టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖలు త్రైమాసిక లక్ష్యాలు, సాధనతో ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్‌ల కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై త్రైమాసిక కార్యాచరణ ప్రణాళిక అమలుచేసే అంశంపై అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖలు అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలను ఏప్రిల్, మే, జూన్ మాసాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## న్యాయ సహాయం కొరకు సంప్రదించండి



**కర్నూల్ పెన్ పవర్ ఏప్రిల్ 21 :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కర్నూల్ నందికొట్కూరు రోడ్ నందు గల షిరిడి సాయి వృద్ధుల, పిల్లల ఆశ్రమం నందు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వీరికి కావలసిన ఉచిత న్యాయ సహాయం కొరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చు అని తెలిపారు. వయో వృద్ధులకు ప్రభుత్వం తరపున నెలకు పెన్షన్ రూ.4,000 ఇవ్వబడుతుందని తెలిపారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15000 ద్వారా ఏమైనా సమస్య లుంటే తమ సంస్థకు తెలుపగలరు అని తెలిపారు. వయో వృద్ధుల సంక్షేమ పథకాల గురించి వివరించారు. వృద్ధుల సహాయర్థం లాయర్‌ల నుండి ఒకరిని, యన్.జి.ఓ. నుండి ఒకరిని సీనియర్ సిటిజెన్ డిపార్ట్మెంట్ నుండి ఒకరిని నియమించామని తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు ఎన్.జి.ఓ, శివరాం, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్, షిరిడి సాయి వృద్ధ ఆశ్రమం నిర్వాహకులు బత్తిని శ్రీనివాసులు, వృద్ధులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరణ







**పలమనేరు పెన్ పవర్ ఏప్రిల్ 21 :** పలమనేరు ఆర్‌డిఓ కార్యాలయంలో పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పలమనేరు శాసన సభ్యులు ఎన్.అమర నాథ్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు, పిఆర్‌ఎస్‌ఈ చంద్ర శేఖర్ రెడ్డి, డ్వామా పిడి రవికుమార్, డిపిఓ సుధాకర్ రావు, డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర కుమార్, రెవెన్యూ డివిజన్ పరిధి లోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఇతర డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఎస్వీయూ కెమిస్ట్రీ బోర్డు చైర్మన్‌గా డాక్టర్ రేణుక మాల్యం



**మదనపల్లె ఏప్రిల్ 21, (పెన్ పవర్) :** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ రేణుక మాల్యం ను నియమిస్తూ.. గత మూడురోజుల క్రితం ఎస్వీయూ వైస్ చాన్సలర్ ఉత్తర్వులు జారీ చేశారు.గత 21 సంవత్సరాలు అధ్యాప కురాలిగా పనిచేస్తున్న డాక్టర్ రేణుక మాల్యం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ చైర్మన్‌గా నియమితులు కావడంపై వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు,వైస్ ప్రిన్సిపాల్ జే.కే.క్రిష్ణమూర్తి, సహచర అధ్యాపకులు,పూర్వ విద్యార్థులు,ప్రస్తుత విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ..హార్థిక అభినందనలు తెలిపారు.2004 ఏప్రిల్‌లో మదనపల్లె బీసెంట్ థియోసాఫికల్ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా విధులలో చేరిన రేణుక మాల్యం, అనంతపురం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో "విష పూరిత మైన లోహాలను నిర్ధారింపు" అనే అంశంపై 2007 నుంచీ 2013 వరకు పరిశోధన చేయడంతో డాక్టరేట్ అవార్డును అందుకు న్నారు. డాక్టర్ రేణుక మాల్యం 22 జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో హాజరై వివిధ విభాగాల నుంచీ చేసిన పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురింపబడ్డాయి. అదే విధంగా పర్యావరణ పర్యవేక్షణకై క్వాంటం సెన్సార్ నెట్‌వర్క్‌లు, బేరియం డోప్ట్ కాఫర్ పెర్రైటగ నానోపార్టికల్స్ యొక్క హైడ్రోథర్మల్ సంశ్లేషణ, వర్గీకరణకై వ్యవస్థ,వికేంద్రీకృత బ్లాక్ చెయిన్ ఫ్రేమ్‌వర్క్‌లను ఉపయోగించి బహుళ అద్దెదారుల క్లౌడ్ నిల్వను సురక్షితం చేసిన అంశాలపై స్వయంగా పరిశోధనలు చేసి పేటంట్లను పొం దారు. 2004 నుంచీ 2021 ఆగస్టు వరకు మదనపల్లె బీటీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రేణుకమాల్యం ను బదిలీ చేస్తూ.. ఉత్తర్వుల మేరకు 2021 అక్టోబర్ 9న వాయల్పాడు ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు.డాక్టర్ రేణుక మాల్యం కు ఎస్వీయూ కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా నియమితులు కావడంపై కళాశాల ప్రిన్సిపాల్, సహచర అధ్యాపకులు, పలువురు మేధావులు హర్షం వ్యక్తం చేశారు.

# చిల్డ్రన్స్ హెూమ్‌ను తనిఖీ చేసిన న్యాయమూర్తి





**కర్నూలు పెన్ పవర్ ఏప్రిల్ 21 :** జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి.కబర్ధి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గారు, మరియు LSUC కమిటీ సభ్యులైన శివరాం, డిప్యూటీ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్, రాయపాటి శ్రీనివాసులు, పారా లీగల్ వాలంటీర్‌లు కలసి సోమవారం కర్నూలు మిలటరీ కాలనీ నందుగల ఇన్ఫాన్ జీసస్ చిల్డ్రన్ హెూమ్‌ను తనిఖీ చేయడం జరిగింది. ఆశ్రమంలోనీ నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమంలోని రికార్డులను అలాగే పరిశుభ్రతను పరిశీలించారు.

అలాగే వారికీ అందుతున్న ఆహార, వైద్య సదుపాయల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికీ న్యాయ సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేసారు.

## సీఎమ్‌ఓ కార్యాలయం నుండి వచ్చిన అర్జీల జాప్యం : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటి కప్పుడు చూడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్‌ఎస్)లో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరిం చారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారు లతో సమీక్షించారు..పిజిఆర్‌ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, అదే విధంగా రీఓపెన్ అయిన అర్జీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని అధికారు లను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం లాగిన్ లో 14 రోజుల నుండి 2 అర్జీలు, 15 రోజుల నుండి 1 అర్జీ, సిడిపిఓ, కర్నూలు వద్ద 11 రోజుల నుండి 2 అర్జీలు, తహసిల్దార్, కర్నూలు అర్బన్ వద్ద 14 రోజుల నుండి 1 అర్జీ ఉన్నా, వాటిని ఇంతవరకు ఓపెన్ చేయలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు... లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని చెప్పినప్పటికీ నిర్లక్ష్యం వహించడం తగదని కలెక్టర్ పేర్కొన్నారు.. అదే విధంగా రీ ఓపెన్ అయిన వాటిలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, కర్నూలు వారి వద్ద ఎక్కువ పెండింగ్ లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు ఆర్డీఓ ను ఆదేశించారు. సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 23, కర్నూలు ఆర్డీఓ వద్ద 20, పత్తికొండ ఆర్డీఓ వద్ద 11, సర్వే ఏడి వద్ద 5, డిఆర్డిఏ పిడి, మెప్మా పిడిల వద్ద 2, దేవాదాయశాఖ, విద్యా శాఖ, అటవీశాఖ, డిపిఓ, డ్వామా, హౌసింగ్‌ల వద్ద 1 అర్జీ చొప్పున పెండింగ్‌లో ఉన్నాయన్నారు.. సిఎంఓ గ్రీవెన్స్ లు పెండింగ్ ఉండకూడదని, ఎప్పటికపుడు పరిష్కారం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు... ఈ అంశం పై ఒక సమీక్ష ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిఆర్‌ఓను ఆదేశించారు.. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య డిఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పట్ల సత్వరమే స్పందించాలి : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





**కడప, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన స్పందించి.. నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్) లో జేసీ అదితిసింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు లతో కలిసి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తు లను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీ దారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతతో పరిష్కార నివేదికలు పంపాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని.. వీ.ఎన్. పల్లె మండలం ఊటు కురు గ్రామం నుండి ఎర్ర గోవిందుల లక్ష్మీ దేవి... జియన్ ఎస్ఎస్ కుడి కాలువ నిర్మాణంలో భాగంగా భూమి కోల్పో యిన తమకు నష్టపరిహారం త్వరగా అందివ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్ వారిని అభ్యర్థించారు. బి.కోడూరు మండలం తిప్పారాజు పల్లె నుండి ఎస్. కేశవ.. తనకు డిఆర్డీఏ ద్వారా డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ ఇప్పించాలని కలెక్టర్ ను కోరారు. వల్లూరు మండల కొట్లురు గ్రామానికి చెందిన ఎస్. గంగమ్మ.. తనకు గతంలో కేటాయించిన పక్క గృహం శిథిలావస్థలో ఉందని, ప్రభుత్వం కొత్త బిల్డింగ్ ను మంజూరు చేయాలని.. కలెక్టర్ ను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, వెంకటపతి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిఆర్డీఏ పిడి ఆనంద్ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా జిల్లా జడ్జి ఈ.భీమారావుని కలిసిన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీ.ఎస్.చేతన్



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** అనంతపురం నగరంలోని జిల్లా కోర్టులో సోమవారం సాయంత్రం నూతనంగా జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా జడ్జి ఈ.భీమారావుని సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

## మే 1, 2వ తేదీలలో వాచీల ఈ-వేలం

**తిరుమల పెన్ పవర్ ఏప్రిల్ 21 :** తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను మే 1, 2వ తేదీలలో రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నారు. ఇందులో టైటాన్, సిటిజన్, సొనాట, రాగా, టైమ్స్, టైమెక్స్, ఇతర కంపెనీల స్మార్ట్ వాచీలున్నాయి. కొత్తవి/ఉపయోగించిన/పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 62 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయం (వేలములు) 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లో, టిటిడి వెబ్‌సైట్ www.tirumala.org లేదా రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ www.konugolu.ap.govt.inను సంప్రదించగలరు.

## మే 1 నుండి 10వ తేదీ వరకు నారాయణవనం శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుపతి పెన్ పవర్ ఏప్రిల్ 21 :** నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 1 నుండి 10వ తేదీ వరకు ఘనంగా జరుగనున్నాయి. ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు గణపతి ఉత్సవం, అంకురార్పణం నిర్వహిస్తారు. మే 1వ తేదీ ఉదయం 7.30 నుండి 9 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై అగస్త్యేశ్వరస్వామి భక్తులకు దర్శనమివ్వను న్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుండి 11 గంటల మధ్య స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. ప్రతి రోజు రాత్రి 7.30 గంటలకు స్వామివారి వాహన సేవలు ఉంటాయి. మే 2వ తేదీ సింహ వాహనం, మే 3న హంస వాహనం, మే 4న శేషవాహనం, మే 5న నంది వాహనం, మే 6న గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మే 7న రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. మే 8న రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం, అనంతరం అశ్వవాహన సేవ జరుగనున్నాయి. రూ.500/- చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనే గృహస్తు లకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం, అన్నప్రసాదాలను బహుమానంగా అందజేస్తారు. మే 9న ఉదయం 9 గంటలకు శ్రీ నటరాజస్వామివారికి అభిషేకం, వీధి ఉత్సవం జరుగనుంది. రాత్రి 7 గంటలకు రావణేశ్వర వాహనంపై అగస్త్యేశ్వరస్వామి దర్శనమిస్తారు. మే 10న ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కైలాసకోనలో త్రిశూలస్నానం ఘనంగా నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియ నున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ కోలాటం, ఆధ్యాత్మిక, భక్తిసంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ చరిత్రను పరిశీలిస్తే నారాయణవనం ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీ పద్మావతీదేవి తండ్రి అయిన శ్రీ ఆకాశ మహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు పురాణాల ద్వారా తెలు స్తోంది. ఇక్కడ శ్రీ అగస్త్యేశ్వరస్వామివారు స్వయంభువుగా వెలిశారు. స్వామివారి లింగాకారానికి పీఠభాగం అనగా బాణపట్టమును అమర్చి వేద ఆగమశాస్త్ర ప్రకారం శ్రీ అగస్త్య మహర్షులవారు ప్రతిష్ఠ చేసి పూజించినందు వల్ల స్వామివారికి అగస్త్యేశ్వరస్వామి అని పేరు వచ్చింది.

## అమ్మవారిని సేవలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి



**తిరుచానూరు/పెన్ పవర్ /ఏప్రిల్ 21 :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న మాజీ న్యాయమూర్తికిఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద ఆశీర్వాద మండపంలో వేద ఆశీర్వాదం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ రమేష్, ఆలయ అర్చకులు బాబు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల దగ్గర ఫిర్యాదులును స్వీకరిస్తున్న... తాసిల్దార్ మధుసూదన్ రావు



**తొట్టంబేడు/పెన్ పవర్/ఏప్రిల్ 21 :** మండల తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా తాసిల్దార్ మధుసూదన్ రావు అధ్యక్షతన గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించి, భూ సమస్యలపై బాధితుల దగ్గర ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ లో బాధితుల దగ్గర వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలు త్వరగ తన పరిష్కరిస్తామని బాధితలు కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిబ్బంది, వీఆర్వో గోపీనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 23 నుండి మే 3వ తేదీ వరకు శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల ఉత్సవం

**తిరుపతి పెన్ పవర్ ఏప్రిల్ 21 :** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల( శ్రీ రామానుజాచార్యులు) ఉత్సవం ఏప్రిల్ 23 నుండి మే 2వ తేదీ వరకు జరుగనుంది. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకు భాష్యకార్ల వారిని బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాడ వీధి ఉత్సవం, సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు పెద్దమాడ వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, సాత్తుమొర, ఆస్థానం జరుగనుంది. మే 1న భోగి తేరు, మే 2న సాత్తుమొర జరుగనుంది. ఆలయంలో మే 3న గంధపొడి ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 372 అర్జీలు

**- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జిల్లా కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓలు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలి అని, పెండింగ్ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి,ఆన్లైన్ నమోదుతో సిబ్బందికి రసీదులు అందించారు.

**శాఖల వారీగా అర్జీల వివరాలు :** రెవెన్యూ-260, పౌర సరఫరాల శాఖ-4, పోలీస్-13, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-10, స్కిల్ డెవలప్మెంట్-1, ఐటిఐ-2, పంచాయితీ రాజ్-21, కోఆపరేటివ్ సొసైటీ-1, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్-1, రూరల్ డెవలప్మెంట్-7, ఎండోమెంట్ -3, స్కూల్ ఎడ్యుకేషన్-7, రూరల్ పావర్టీ -7, బిఎస్ఎన్ఎల్-1, ఎస్వి మెడికల్ కాలేజ్-1, ఎస్సి కార్పొరేషన్ - 2, బిసి కార్పొరేషన్-2, జాతీయ రహదారులు-4, టిటిడి -2, హార్టికల్చర్ -1 సర్వే -9, ఐ సి డి ఎస్- 2, అటవీ శాఖ-1, రిజిస్ట్రేషన్ శాఖ- 2, నీటి వనరుల శాఖ -2, పబ్లిక్ హెల్త్-2, ఏపీఐఐసీ-2, గనుల శాఖ-1, ఆర్టీసీ-1 మొత్తం 372 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



**పలమనేరు, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** పలమనేరు ఆర్డిఓ కార్యాలయంలో పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పలమనేరు శాసన సభ్యులు ఎన్.అమర నాథ్ రెడ్డి,జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ కె.మోహన్ కుమార్. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు,పి ఆర్ ఎస్ఈ చంద్ర శేఖర్ రెడ్డి, డ్వామా పిడి రవికుమార్, డిపిఓ సుధాకర్ రావు, డిఆర్డిఏ పిడి శ్రీదేవి,ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర కుమార్, రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఇతర డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులకు ఉచిత వ్యాక్సినేషన్...

**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** హజ్ యాత్రికులకు ఈనెల 22 వ తేదీన చిత్తూరు నగర పరిధిలోని టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ నందు రేపు ఉదయం 8 గంటల నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉచితంగా జరుపబడునని కావున యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులు ఆడ,మగ,మరియు పిల్లలకు ఉచిత వ్యాక్సినేషన్ సౌకర్యము ను వినియోగించు కోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## నేటితో ముగియనున్న ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు

**పెన్ పవర్ అనంతపురం ఏప్రిల్ 21 :** 12-05-2025 నుండి 22-05-2025 వరకు జరుగు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల పరీక్ష రుసుము చెల్లించుటకు ఈ నెల 22-04-2025తో ముగియనున్నది. కావున ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన, ఇంప్రూమెంట్ వ్రాయు విద్యార్థులు వెంటనే పరీక్ష రుసుం సంబంధించిన కళాశాలలో చెల్లించవలసినదిగా తెలపడమైనది. ఏదైనా ప్రైవేట్ జూనియర్ కళాశాల యజమాన్యం విద్యార్థుల ఫీజు బకాయి ఉన్నదని సాకు చూపుతూ విద్యార్థులు పరీక్ష ఫీజు కట్టించుకోని ఎడల అటువంటి కళాశాలలపై తగిన చర్యలు తీసుకోనుబడునని తెలపడమైనది. ఫెయిల్ అయిన విద్యార్థులు తప్పనిసరిగా పరీక్ష రుసుము చెల్లించ వలయును. చెల్లించలేనిపక్షంలో సంబంధిత కళాశాల యజమాన్యం బాధ్యులగుదురు అని అనంతపురం ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకటరమణ నాయక్ తెలియజేశారు.

## చదువుల తల్లికి ఘన సన్మానం బితలపా దామోదరం రెడ్డి



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి,ఏప్రిల్ 21 :** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించినటువంటి ఎ.భావన అను విద్యార్థిని ఘనంగా సన్మానించిన శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ అత్యంత పేద కుటుంబంలో పుట్టి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించడం చాలా గొప్ప విషయమని ప్రతి విద్యార్థి అదేవిధంగా చదివి వారి గురువులకు వారి తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని భావి భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.

# వివిపి సిఫార్సు లేఖలు, ఉన్నతాధికారుల డిఓ లెటర్‌లపై సరైన విధమైన చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**





**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** వివిపి సిఫార్సు లేఖలు, ఉన్నతాధికారుల డిఓ లెటర్‌లపై సరైన విధమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో పెండింగ్‌లో ఉన్న వివిపి సిఫార్సులు మరియు విజ్ఞతలు, ఉన్నతాధికారుల డిఓ లెటర్ లు, తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మలతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిపి సిఫార్సు లేఖలు, ఉన్నతాధికారుల డిఓ లెటర్లు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామంలో పర్యటించి ఇచ్చిన హామీలు, మంత్రి నారా లోకేష్ పాదయాత్ర హామీలు, తదితర వాటికి సంబంధించి సామరస్యంగా, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, అందుకు సంబంధించిన ఎప్పటి కప్పుడు అప్డేట్ లను తెలియజేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు.

ఆయా లేఖలకు సంబంధించి ప్రణాళిక ప్రకారం లోతుగా పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారులకు పంపించాల్సినవి వెంటనే పంపించాలన్నారు. ఇందులో ఏమైనా సున్నితమైన సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని, సమస్యల పరిష్కారంలో నిబంధనలు పాటించాలన్నారు. ఆయా లేఖలు, సమస్యలకు సంబంధించి ఈ ఫైల్ నెంబర్లను ఇవ్వాలన్నారు. జిల్లా అధికారులు పారదర్శకత, వృత్తి నైపుణ్యంతో పని చేయాలన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిందని, దీనికి సంబంధించి ముందుకు తీసుకుని వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిఈఓని ఆదేశించారు. నియోజకవర్గ వారిగా డెవలప్మెంట్ ప్లాన్ ని తయారు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో చలివేంద్రాలను అవసరమైన చోట ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, శాశ్వత ఆర్ఓ వాటర్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ అశోక్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ బాలరాజు, పశు సంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, డిపిఓ నాగరాజు నాయుడు, జడ్పి సిఈఓ రామచంద్ర రెడ్డి, సర్వే ఏడి రూప్ల నాయక్, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, డిఈఓ ప్రసాద్ బాబు, డిటిసి వీర్రాజు, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, డ్వామా పిడి సలిం భాష, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్సీ శేషాద్రి శేఖర్, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, జిల్లా రిజిస్టర్ భార్గవ్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాప్ రెడ్డి, బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రమణ్యం, డిసిఓ అరుణకుమారి, హౌసింగ్ పిడి శైలజ, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, హెచ్ఎల్సి ఎస్ఈ రాజశేఖర్, మైన్స్ డిడి వెంకటేశ్వరరావు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాప్ రెడ్డి, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, ఎన్ఐసి డిఐఓ రవిశంకర్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియజుద్దీన్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించండి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** వాట్సప్ గవర్నెన్స్ సేవలను వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ఏపీ ప్రభుత్వం వాట్సాప్ సేవలు" పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకి అందచేస్తున్న వివిధ పౌర సేవలు మరింత చేరువ చేసే క్రమంలో వాట్సాప్ గవర్నెన్స్ ను "9552300009" నెంబర్ ద్వారా తీసుకు రావడం జరిగిందని పేర్కొన్నారు. ఏప్రిల్ నెల 15వ తేది నుండి ఇంటివద్ద నుంచే పౌరసేవలు-"మనమిత్ర" వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం అయ్యాయన్నారు.. ఈ వేదిక ద్వారా ప్రజలు ప ధ్రువపత్రాలు, లైసెన్సులు, పన్నుల చెల్లింపులు, బిల్లులు, దేవాలయ దర్శనాలు, పరీక్ష ఫలితాలు వంటి 250కి పైగా సేవలను పొందవచ్చునన్నారు.

అవినీతికి తావు లేకుండా వేగంగా సేవలు అందించేందుకు ఇది మరో ప్రగతిశీల చర్యగా నేటి సుపరిపాలనలో నిలవనుందన్నారు. ఇళ్లకు వెళ్లి , సంబంధిత గృహ యజమానికి వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తూ కరపత్రములను అందించాలన్నారు. అదే విధంగా శక్తి యాప్, సైబర్ నేరాల పైన కూడా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కోవెలకుంట్లలో ప్రభుత్వ కార్యాలయాల్లో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆకస్మిక తనిఖీ







**కోవెలకుంట్ల, పెన్ పవర్, ఏప్రిల్ 21 :** కోవెలకుంట్లలోని 5 వ సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్, డీఆర్డీఏ వెలుగు కార్యాలయాల్లో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ విధుల్లో బాధ్యతారాహిత్యంగా ఉన్న అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విధులకు హాజరవుతున్న అధికారుల వివరాలను ప్రత్యేకంగా పరిశీలించిన మంత్రి.. ప్రతి ఉద్యోగి విధుల నిర్వహణలో భాద్యతతో మెలగాలని, తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి ప్రజలకు జవాబుదారీగా నిలవాలని ఆయా అధికారులకు సూచించిన మంత్రి.. కోవెలకుంట్ల-2 హెల్త్ క్లినిక్ సెంటర్ ను పరిశీలించిన సందర్భంగా అక్కడ అపరిశుభ్రతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర వంటి కార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నప్పటికీ.. ప్రభుత్వ సిబ్బందిలో మాత్రం మార్పు రావడం లేదని మంత్రి ఆగ్రహం. ఈ సందర్భంగా రోగులకు స్థానికంగా అందిస్తోన్న సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్న మంత్రి. నేడు డీఆర్ డీఏ వెలుగు కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి బీ సీ జనార్ధన్ రెడ్డి.. ఈ సందర్భంగా కార్యాలయంలో శిక్షణ తీసుకుంటున్న మహిళలతో మాట్లాడిన మంత్రి. కుట్టు మిషన్లు ఉన్నప్పటికీ ఛైయిర్స్ లేకపోవడంతో తాము మిషన్ వర్క్ నేర్చుకోలేకపోతున్నామని మంత్రి దృష్టికి తీసుకొచ్చిన మహిళలు. ఈ అంశంపై సంబంధిత అధికారితో ఫోన్ లో మాట్లాడి.. వెంటనే పరిష్కరించాలని సూచించిన మంత్రి. త్వరలో ఛైర్స్ ఏర్పాటు చేస్తామని మంత్రికి తెలిపిన డీఆర్ డీఏ వెలుగు అధికారి. కోవెలకుంట్ల 5 సచివాలయం పరిశీలన సందర్భంగా.. మండలంలో భూసర్వే జరుగుతున్న తీరుపై స్థానిక ఎమ్మార్వో పవన్ కుమార్ రెడ్డిని ఆరా తీసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. సకాలంలో భూసర్వేను పూర్తి చేసి, స్థానిక ప్రజలు, రైతుల రెవెన్యూ సమస్యలు పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మార్వోను ఆదేశించిన మంత్రి.

# హెపటైటిస్ బి,సి వైరస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పొంది నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్, 21 :** హెపటైటిస్ బి, సి వైరస్ పై ప్రతి ఒక్కరూ అవగాహన పొంది నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకొని అందుకు తగ్గ నివారణ వ్యాక్సిన్లు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను సూచిస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజల నుండి వినతులు స్వీకరించిన అనంతరం హెపటైటిస్ బి, సి వైరస్ పై మైక్రోబయాలజీ విభాగాధిపతి డా. శ్రీనివాస్ తో జిల్లా కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జాయింట్ కలెక్టర్ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా 254 మిలియన్స్ జనాభా హెపటైటిస్ వైరస్ వల్ల ఇబ్బందులు గురవుతున్నారని అందులో భారత్ రెండవ స్థానంలో ఉందన్నారు. హెపటైటిస్ వైరస్ వ్యాప్తి నివారణ కోసం 2018 లో నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్ ను అమలు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు హెపటైటిస్ బి కేసులు 1.90 శాతం, హెపటైటిస్ సి 0.17 శాతం మేరకు నమోదు అవ్వడం జరిగిందన్నారు. వైరస్ ను నిర్ధారణ చేయడానికి ర్యాపిడ్, ఎలిసా, వైరల్ లోడ్ టెస్టుల ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చు అన్నారు. హెపటైటిస్ వైరస్ నివారణ కోసం నాలుగు డోసులు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. హెపటైటిస్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ రావని ఇతర రుగ్మతలతో బాధపడుతున్న వారు ఎవ్వరైనా హెపటైటిస్ పరీక్ష చేసుకొని పాజిటివ్ గా నిర్ధారణ అయితే వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. హెపటైటిస్ వైరస్ లు లాలాజలం, ఇతరులకు వాటిని ఇంజెక్షన్లు ఇంకొకరికి వాడడం, బ్లేడు తదితర వాటి ద్వారా వ్యాప్తి చెందుతున్నారు. ఇతర జబ్బుల మాదిరిగా హెపటైటిస్ వైరస్ వ్యాధి లక్షణాలు బహిర్గతం కావని ఇతర పరీక్షలు చేసుకున్నప్పుడు మాత్రమే బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ఇంట్లో ఒకరికి హెపటైటిస్ వైరస్ నిర్ధారణ అయితే ఇంట్లో అందరూ పరీక్షలు చేసుకొని తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## సమాజానికి ఆర్.ఎమ్.పి.లచే ఎప్పుడూ ప్రమాదమే!

**ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డా.జి.నంద కిషోర్**




**పలమనేరు ఏప్రిల్ 21,(పెన్ పవర్) :** సమాజానికి ఆర్.ఎమ్.పి.లచే ఎప్పుడూ ప్రమాదమేనని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డా.జి.నంద కిషోర్ అన్నారు. ఆదివారం ఆయన పలమనేరుకు విచ్చేసిన సందర్భంగా ఆర్.ఎమ్.పి.లపై పై వ్యాఖ్యలు చేశారు. పట్టణంలోని సాయిరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఆదివారం జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశానికి స్టేట్ ప్రెసిడెంట్ డా.జి.నంద కిషోర్, స్టేట్ జెనరల్ సెక్రటరీ డా.యం.సుభాష్ చంద్రబోస్ పలమనేరు ప్రెసిడెంట్ డా.ఇ.యుగంధర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో డా.నందకిషోర్ మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పిటల్ వ్యవస్థలో జరుగుతున్న మార్పులు గురించి, అలాగే ఆర్.ఎమ్.పి వల్ల వస్తున్న సమస్యల గురించి మాట్లాడారు. ఆర్.ఎమ్.పి.ల దగ్గర ఎంత వరకు పరిమితమైన వైద్యం తీసుకోవాలో ప్రజలుకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పలమనేరు ప్రెసిడెంట్ డా.ఇ.యుగంధర్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం పైన అవగాహన కల్పించే సేవలు త్వరలోనే అందుబాటు లోకి తీసుకొస్తామని, ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా కృషి చేస్తామని తెలిపారు.ప్రస్తుతం ఈ వేసవికాలంలో ప్రజలు ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డా.మమత రాణి, డా.సునీల్,డా.నాగ మల్లీశ్వరి, డా.నాగరాజ్, డా.ఖలీల్, డా.తరంగిణి, డా.శారద, డా.అనీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి ఆర్.ఎమ్.పి.లచే ఎప్పుడూ ప్రమాదమే!

**ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డా.జి.నంద కిషోర్**



**పలమనేరు ఏప్రిల్ 21,(పెన్ పవర్) :** సమాజానికి ఆర్.ఎమ్.పి.లచే ఎప్పుడూ ప్రమాదమేనని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డా.జి.నంద కిషోర్ అన్నారు. ఆదివారం ఆయన పలమనేరుకు విచ్చేసిన సందర్భంగా ఆర్.ఎమ్.పి.లపై పై వ్యాఖ్యలు చేశారు. పట్టణంలోని సాయిరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఆదివారం జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశానికి స్టేట్ ప్రెసిడెంట్ డా.జి.నంద కిషోర్,స్టేట్ జెనరల్ సెక్రటరీ డా.యం.సుభాష్ చంద్రబోస్ అలాగే పలమనేరు ప్రెసిడెంట్ డా.ఇ.యుగంధర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో డా.నంద కిషోర్ మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పిటల్ వ్యవస్థలో జరుగుతున్న మార్పులు గురించి, అలాగే ఆర్.ఎమ్.పి వల్ల వస్తున్న సమస్యల గురించి మాట్లాడారు. ఆర్.ఎమ్.పి.ల దగ్గర ఎంత వరకు పరిమితమైన వైద్యం తీసుకోవాలో ప్రజలుకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పలమనేరు ప్రెసిడెంట్ డా.ఇ.యుగంధర్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం పైన అవగాహన కల్పించే సేవలు త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని,ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఈ వేసవికాలంలో ప్రజలు ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డా.మమత రాణి, డా.సునీల్,డా.నాగ మల్లీశ్వరి, డా.నాగరాజ్, డా.ఖలీల్, డా.తరంగిణి, డా.శారద డా.అనీష్ తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై హమాలి వర్కర్స్‌కి జీతాలు వెంటనే ఇవ్వాలి : ఏఐటీయూసీ డిమాండ్




**శ్రీకాళహస్తి,పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 21 :** తిరుపతి జిల్లా సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యల మీద శ్రీ కాళహస్తి పాయింట్ నందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సమస్యలు,సివిల్ సప్లై హమాలిస్ మంత్లీ శాలరీలు తిరుపతి జిల్లాలో మాత్రం 20వ తారీకు పైన చెల్లిస్తున్నారు, పక్కనే ఉన్నటువంటి చిత్తూరు జిల్లా అన్నమయ్య జిల్లా నెల్లూరు మిగిలిన జిల్లాలు 12వ తారీకు కల్లా హమాలి చార్జెస్ చెల్లిస్తున్నారు, ఒక్క తిరుపతి జిల్లా మాత్రం మూడు దఫాలు గ్రీవెన్స్ డే రోజున డైరెక్ట్ గా కలెక్టర్ ,కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఆయన గాని తిరుపతి జిల్లా డిఎంకి చలనమే లేదు పనిని మాత్రం 30వ తారీకు కల్లా మూమెంట్ పూర్తిచేయాల ని హమాలీలపై పని ఒత్తిడి చేస్తున్నారు, దీనికి నిరసనగా తిరుపతి జిల్లాలో ఉన్నటువంటి 12 ఎంఎల్ఎస్ పాయింట్లు పూర్తిగా బంద్ చేసి ధర్నా కార్యక్రమం చేయడం జరుగుతుంది. అదేవిధంగా పెంచిన మూడు రూపాయల కూలికి సంబంధించిన హరియర్స్ను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసినప్పటికీ జిల్లాలో మాత్రం ఎటువంటి పని ముందుకు వెళ్ళలేదు పై కార్యక్రమాల మీద శ్రీకాళహస్తి పాయింట్ నందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సెక్రటరీ జనమాల గురవయ్య పట్టణ కార్యదర్శి రొద్ద గోపి, ఏఐటియుసి అధ్యక్షులు అయ్యప్ప గిరి, రుక్కు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మామను స్క్రూడ్రైవర్‌తో పొడిచిన అల్లుడు పరార్



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 21 :** నారాయణపురానికి చెందిన సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య అన్నదమ్ములు. కృష్ణయ్య కుమార్తె మునీశ్వరిని అదే గ్రామానికి చెందిన గోపితో వివాహం చేశారు. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం పుట్టింటికి వచ్చిన మునీశ్వరితో గోపి గొడవ పడుతుండగా సర్ది చెప్పడానికి వెళ్లిన సుబ్రహ్మణ్యంను స్క్రూ డ్రైవర్తో పొడిచి పరారయ్యాడు.

## ముక్కంటీశ్వరుడి సేవలో త్రిపుర గవర్నర్




**శ్రీకాళహస్తీ, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి సోమవారం వచ్చారు. ఆలయ ఈవో టి.బాపిరెడ్డి స్వాగతం పలికారు. ఆయన ప్రత్యేక రాహుకేతు పూజ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేసుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శన అనంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## నెలాఖరులోగా ఈ కేవైసీ పూర్తి చేయండి : ఎమ్మార్వో లక్ష్మీ నరసింహ



**రాపూరు/పెన్ పవర్/ ఏప్రిల్ 21 :** రాపూరు మండలంలో పెండింగ్ లోనున్న రేషన్ కార్డుదారుల ఈ కేవైసీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని తాహసిల్దార్ , వీఆర్వోలు మరియు డీలర్లకు సూచించారు. తాహసిల్దార్ కార్యాలయంలో సాయంత్రం వీఆర్వోలు మరియు డీలర్లతో ఈ కేవైసీకి సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రేషన్ లబ్ధిదారులకు పెండింగ్ లోనున్న ఈకేవైసీని వీఆర్వోలు డీలర్లు సమన్వయంతో పనిచేసి పూర్తి చేయాలని చెప్పారు. ఈ కేవైసీ పెండింగ్ లో ఉన్న లబ్ధిదారులకు రేషన్ బియ్యం నిలిచిపోతాయ న్నారు. కావున ఈ కేవైసీ నమోదులో నిర్లక్ష్యం వహించే వీఆర్వోలు, డీలర్లపై చర్యలు తీసుకుంటామ న్నారు. మండలంలో 2500 మందికి ఈ కేవైసీ పెండింగ్ లో ఉన్నాయన్నారు. బయోమెట్రిక్ సమస్య ఉన్నవారు ఆధార్ సెంటర్లో వేలిముద్రలు అప్డేటెడ్ చేయించుకుని తదుపరి డీలర్ల వద్దకు వెళ్లి ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. వీఆర్వోలు ఈ కేవైసీ పెండింగ్లో ఉన్న లబ్ధిదారులను గుర్తించి రేషన్ డీలర్ల వద్దకు పంపి ఈ కేవైసీ పూర్తి చేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. రానున్న మూడు రోజుల్లో పెండింగ్లో ఉన్న ఈ కేవైసీ లక్ష్యాలను అధిగమించేలా వీఆర్వోలకు ప్రత్యేక సూచనలు చేయడమైనది.

## ఇసుక పంపిణీ ప్రక్రియ సజావుగా జరగాలి

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి





**కడప, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ ప్రక్రియ సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక లభ్యత వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లతో కలసి జిల్లా స్థాయి సాండ్ కమిటీ (డిఎల్ఎస్ సి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఓబులమ్మ, గనులు భూగర్భ శాఖ డిడి సూర్యచంద్రరావు, రీజినల్ ట్రాన్స్పోర్ట్, పోలీస్ అధికారులు, గ్రౌండ్ వాటర్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు : కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి/పెన్ పవర్/ఏప్రిల్ 21 :** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 33 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ ఆమరయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 9 మంది తమ సమస్యలు తెలుపగా, 24 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ భూపాల్ హౌసింగ్ కాలనీ లో వెల్డింగ్ షాపు వలన వచ్చే శబ్దాలతో ఇబ్బందిగా ఉందని,అక్కారం పల్లిలో మూసివేసిన కాలువలు వినియోగంలోకి తేవాలని, కుక్కల బెడద తగ్గేలా చూడాలని, చంద్రశేఖర్ రెడ్డి కాలనిలో యూడీఎస్ కాలువ బ్లాక్ అవుతున్నది శాశ్వత పరిష్కారం చూపాలని, శ్రీకృష్ణ నగర్ లో తుడా ఉద్యోగి రోడ్డు ఆక్రమించి గోడ కట్టారు చర్యలు తీసుకోవాలని, నీటి కనెక్షన్ లేకున్నా బిల్లు వస్తోంది పరిష్కరించాలని, రైతు బజారు వద్ద రోడ్డుపై అమ్మకాలు చేస్తుండడంతో రైతు బజారులో వ్యాపారాలు జరగడం లేదు పరిష్కరించాలని, తిలక్ రోడ్డు, రెడ్డి అండ్ రెడ్డి కాలనీల్లో మురుగు కాలువలు పూర్తిగా పాడయ్యాయి బాగు చేయాలని, కోరమేను గుంటలో గిఫ్ట్ డీడ్ ఇచ్చినా టిడిఆర్ బాండ్ ఇవ్వలేదని, సిపిఆర్ అపార్ట్మెంట్ వద్ద కాలువపై బండలు తొలగించడంతో చెత్త వేస్తున్నారు పరిశీలించాలని, మురుగు కాలువలు శుభ్రం చేయాలని కోరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, డి.ఈ.లు, ఏసిపిలు ఉన్నారు.

## కేఎం జఖీవుల్లా మృతి బాధాకరం : మంత్రి ఎస్.సవిత




**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** మాజీ ఎంపీ సైఫుల్లా కుమారుడు కేఎం జఖీవుల్లా మృతి బాధాకరమని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రివర్యులు ఎస్.సవిత పేర్కొన్నారు. సోమవారం అనంతపురం నగరంలోని రామ్ నగర్లో అంబేద్కర్ ఫ్లైఓవర్ పక్కన ఉన్న మాజీ రాజ్యసభ సభ్యులు కేఎం సైఫుల్లా ఇంటివద్ద ఆయన కుమారుడు కేఎం జఖీవుల్లా గుండె పోటుతో మృతి చెందగా, మృతదేహానికి మంత్రి ఎస్.సవిత, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, తదితరులు నివాళులు అర్పించారు. కేఎం సైఫుల్లాను మంత్రి, ఎమ్మెల్యేలు ఓదార్చి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ జఖీవుల్లా గుండెపోటుతో మృతిచెందడం తీరని లోటన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని ఆయన అనంతపురం నుంచి పెనుకొండ బాబయ్య స్వామి దర్గాకు పాదయాత్ర చేశారని గుర్తు చేసుకున్నారు. జఖీవుల్లా మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చాలా బాధపడ్డారన్నారు. వారి కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ మాజీ ఎంపీ సైఫుల్లా కుమారుడు, మిత్రుడు కేఎం జఖీవుల్లా నిన్నటిరోజున చనిపోవడం తీరని లోటన్నారు. ఆయన ఎంతో కష్టపడి పని చేసే వ్యక్తి అని, ఆయన మృతి బాధాకరమ న్నారు. జక్కీవుల్లా చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకు న్నారు. జఖీవుల్లా దేహానికి నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, తదితరులు ఉన్నారు.

## రాప్తాడులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ




**అనంతపురం, పెన్ పవర్, ఏప్రిల్ 21 :** రాప్తాడు మండల పరిధిలోని ప్రసన్నాయనపల్లి గ్రామం వద్దనున్న ఆర్.జె.సి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని, ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మరియు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తిప్పే నాయక్, మల్లికార్జున, రామ్మోహన్, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవ నాయుడు, ప్రసన్నాయనపల్లి గ్రామ సర్పంచ్ శశికళ వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజక వర్గ, మండల అధికారులు, తదితరులు.

## గిరిజనుల జీవనోపాదులను అటవీ ఉత్పత్తులపై అవగాహన

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** జిల్లాలోని 14 మండలాలలోని 45 నివాసిత గిరిజన ప్రాంతాల గిరిజనుల జీవనోపాదులపై దృష్టి సారించి అభివృద్ధి చేసేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వ్యవసాయ శాస్త్రవేత్తలను సూచించారు. సోమవారం ప్రాంతీయ పరిశోధన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ఏడు రోజుల శిక్షణా కార్యక్రమ ప్రారంభో త్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. వ్యవసాయ పరిశోధన అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ డాక్టర్ ఎం జాన్సన్, ఏడిఆర్సి డిడి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అనాది కాలం నుండి గిరిజన తాండ ప్రాంతాలలో గిరిజనులు వారసత్వ సంపదగా అటవీ మార్గాన్ని ఎంచుకొని అటవీ ఉత్పత్తులను సేకరించి విక్రయించుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పుడిప్పుడే తమ జీవనసరళి మార్చుకొని సమాజంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో చేయూతనిచ్చి వారి జీవనోపాదులను పెంపొందించేం దుకు కృషి చేయాలన్నారు. తాను ఇప్పటివరకు జిల్లాలో 12 గూడెంలలో పర్యటించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి నన్నారి మొక్కల పెంపకం, నన్నారి తయారు చేసే యంత్రాలను ఆత్మకూరులో ఏర్పాటు చేసి తద్వారా గిరిజనులు అధిక ఆదాయం పొందడం జరిగిందన్నారు. ఇదే తరహాలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకాన్ని చేపట్టినట్టయితే నాణ్యమైన తేనెతో పాటు తేనెటీగల వలన వచ్చేటువంటి వివిధ ఉత్పత్తులను కూడా మార్కెటింగ్ చేసి అధిక లాభాలను పొందవచ్చు అన్నారు. శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకాన్ని సమూహంగా వన్ దన్ వికాస కేంద్రాల ద్వారా చేపట్టినట్లయితే భవిష్యత్తులో నంద్యాల జిల్లా నుంచి తయారుచసిన ఈ తేనెను రాష్ట్ర మొత్తం కూడా సరఫరా చేసేందుకు మంచి వనరులు ఉన్నాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అనుభవజ్ఞు చెప్పిన శాస్త్రీయ సలహాలను పాటించి తేనెటీగల పెంపకాన్ని చేపట్టి తమ స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ కోరారు.




అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ ఎం జాన్సన్ మాట్లాడుతూ ఈ ఏడు రోజుల శిక్షణా కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం చెంచులకు జీవనోపాధి కల్పించుటలో భాగంగా శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం అనే శిక్షణ కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం నారపురెడ్డి కుంట గ్రామానికి చెందిన చెంచులకు ప్రత్యేకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం చేపట్టడం వలన అధిక ఆదాయాన్ని పొందడమే కాకుండా వారి యొక్క స్థితిగతులను కూడా మెరుగుపరచుకోవడం సాధ్యమవుతుందని తెలిపార. ఈ శిక్షణ కార్యక్రమం ప్రధానంగా ప్రస్తుతం అవలంబిస్తున్నటు వంటి తేనే తీయుట పద్ధతుల కంటే కూడా నాణ్యమైన మరియు అధిక తేనె ను పొందవచ్చన్నారు. ఏడిఆర్సి డిడి కె. చెన్నయ్య నాణ్యమైన తేనె లభ్యత అనేది ప్రశ్నార్ధకంగా ఉన్న పరిస్థితులలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు తేనె తీగల పెంపకందార్లకు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా నల్లమల హనీ బీ పార్క్ బలపనూరు గ్రామం వారు ఏర్పాటు చేసినటువంటి స్టాల్స్ ను సందర్శించి తేనెటీగల పెట్టెల నుండి తేనెను తీసేటువంటి విధానాన్ని తిలకించడం జరిగింది ఈ కార్యక్రమంలో నారపురెడ్డి కుంట గ్రామానికి చెందిన చెంచులు, నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మరియు బోధనా మరియు బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాది రైతు ప్రభుత్వం : మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి




**(3వ పేజీ తరువాయి)** వెనుకబడిన ప్రాంతంగా ఉన్న అనంతపురం జిల్లా హార్టికల్చర్ ద్వారా నేడు జీఎస్డీపీలో ముందు వరుసలోకి వస్తున్న పరిస్థితి అన్నారు. మన ప్రాంతంలో కూడా హార్టికల్చర్ ఎక్కువగా ఇప్పుడిప్పుడే వస్తోందన్నారు. హార్టికల్చర్లో పంట రావడానికి సమయం ఎక్కువ తీసుకుంటుది.. కానీ, తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఆదాయం వస్తోంది.. భూమి కూడా సారవంతంగా మారుతోందన్నారు. జొన్నలు గిట్టుబాటు ధర రావడం లేదని స్థానికంగా రైతుల మా దృష్టికి తీసుకొస్తే, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు.. సీఎంను కలిసి విన్నవించడంతో నేడు గిట్టుబాటు ధరకే జొన్న కొనుగోలు చేస్తున్న పరిస్థితి వచ్చిందన్నారు. మాది రైతుల ప్రభుత్వం.. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తిగా పక్కదోవ పట్టించిందన్నారు. నేడు కేంద్రం నుంచి పోలవరంకు నిధులు తిరిగి తీసుకొచ్చి, తద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దాదాపు రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో పోలవరం-బనకచర్ల అనుసంధానంకు చంద్రబాబు ప్రణాళికలు రచిస్తోన్నారు. కేంద్రం సాయంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తే, మన ప్రాంతమంతా అభివృద్ధిమయంగా మారుతుందన్నారు. ఖచ్చితంగా ప్రతీ రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ- పంటలో నమోదు చేసుకోకపోతే, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. నేడు రైతులు కూలీలు దొరక్క ఇబ్బంది పడుతున్న తరుణంలో డ్రోన్స్ ను వ్యవసాయ రంగంలో వినియోగిస్తున్నారన్నారు. డ్రోన్స్ మా శాఖ పరిధిలోకి వస్తుంది.. స్థానికంగా వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం పెంచేందుకు అవసరమైతే సబ్సిడీ ద్వారా వాటిని ఇచ్చేందుకు అవకాశాలను పరిశీలిస్తామన్నారు. డ్రోన్స్ ను వ్యవసాయంలో వినియోగించుకోవడం ద్వారా రైతులు అనేక విధంగా లబ్ధి పొందవచ్చునన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతులకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

### భూ సమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండాతో ముందుకు సాగుతున్నాం

**(3వ పేజీ తరువాయి)** నాణ్యమైన పరిష్కారం చూపుతామన్నారు. పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల నుండి జిల్లా కేంద్రంకు వచ్చి సమస్యలను విన్నవించడానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇదొక సదవకాశమని పేర్కొన్నారు.జిల్లాలలో పిజిఆర్ఎస్ ద్వారా 53 వేల వినతులు అందగా అందులో 12 వేల అర్జీలు కుప్పం నియోజకవర్గం నుండి అందాయని, క్రమంగా కుప్పంలో పర్యటించి సాధ్యమైనంత సమస్యలకు పరిష్కారం చూపామన్నారు.అదే తరహాలో మిగిలిన నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు. పలమనేరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ పూర్తిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన అని, గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇదే విధంగా అధికార యంత్రాంగాన్ని ప్రజల దగ్గరకు పంపి వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపేలా చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశ్యం అన్నారు.పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలలో గల ప్రజల సమస్యలను స్వీకరించడం జరిగిందన్నారు. పుంగనూరులో గతంలో జమీందారీ వ్యవస్థ ఉండడం, పలమనేరులో కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా రెవెన్యూ సమస్యలు ఉత్పన్నమయ్యాయని, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. పలమనేరు డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పలమనేరు డివిజన్ కేంద్రంలో రానున్న మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ఈ సదవకాశాన్ని పలమనేరు డివిజన్ ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్వర్ణముఖి నదిని కాపాడండి : సిపిఎం



**నాయుడుపేట/పెన్ పవర్ ఏప్రిల్ 21 :** విచ్చలవిడిగా దోపిడీకి గురవుతున్న నాయుడుపేట స్వర్ణముఖి నదిని కాపాడాలని సిపిఎం నాయకులు శివకవి.ముకుంద నాయుడుపేట తాహసిల్దార్ రాజేంద్ర కు వినతి పత్రం ఇచ్చారు. నాయుడుపేట స్వర్ణముఖి నదిలో కొన్నాళ్లుగా కొంతమంది అక్రమ దారులు విచ్చలవిడిగా ఇసుక దోచేస్తున్నారని స్వర్ణముఖి నదిని కాపాడాలని సిపిఎం నాయకులు శివకవి.ముకుందా సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఎమ్మార్వో కార్యాలయంలో నాయుడుపేట తహసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా నాయుడుపేటలో కొంతమంది అక్రమ దారులు ఇసుకను విచ్చలవిడిగా దోచుకుంటూ ఈ దోపిడితో లక్షలు ఆర్జిస్తున్నారని వాళ్ల స్వలాభం కోసం ఇలా ఇసుకను ఇష్టానుసారంగా ఎత్తేసి రేపటి తరాలకు నీటి నిలువలు లేకుండా చేస్తున్నారని దీనిపై స్పందించకపోవడం ఏ ఒక్క నాయకుడు కూడా ఈ విషయంపై పెదవి విప్పకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు.

## పిజిఆర్ఎస్ కు 290 దరఖాస్తులు : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్ 21 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులలో రీఓపెన్ అయిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సరించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రీఓపెన్ దరఖాస్తులు 68 ఉన్నాయని వీటన్నింటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్లో ఉన్న 1641 దరఖాస్తులను వితిన్ ఎస్ఎల్ఎ లోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎంఓ కార్యాలయం, విఐపి గ్రీవెన్స్ కు సంబంధించి 15 పెండింగ్లో ఉన్నాయని వీటిని కూడా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదుల అర్జీదారుల అభిప్రాయ సేకరణ వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర యాప్ లో పెండింగ్ లో ఉన్న శాఖలు తక్షణమే సంబంధిత అంశాలను పూరించి ఫోటోలతో సహా అప్లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా పెండింగ్ లో ఉన్న 451 మంది మిస్సింగ్ ఎంప్లాయిస్ డేటా, సిటిజన్ ఈ-కేవైసీ, వర్క్ ఫ్రం హోం డేటా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 40 శాతం మంది మాత్రమే మొబైల్ యాప్ వినియోగిస్తున్నారని ఇంటింటికి వెళ్లి మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరి చేత నంబర్ సేవ్ చేయించి హాయ్ అని మెసేజ్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులు ఆదర్శించారు. పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్లలో ఎల్లప్పుడూ నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు :** 1) చాగలమర్రి మండలం తోడెండ్లపల్లి గ్రామ కాపురస్తుడు జగదేశ్వరరెడ్డి తనకు గ్రామ పొలిమేర లో సర్వే నెంబర్ 265 మరియు 264 లో 7 ఎకరాల 35 సెంట్లు ఉన్నదనీ సంబంధిత పొలాన్ని ఆన్లైన్లో నమోదు చేసి పాస్ పుస్తకం ఇప్పించగలరని కొరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు. 2) నందికొట్కూరు మండలం బ్రాహ్మణకోట్కూర్ గ్రామానికి చెందిన షేక్ ఇంతియాజ్ బాషా తనకు అభయహస్తం పథకం డబ్బులు క్లెయిమ్ అవ్వటం లేదని... డబ్బులు క్లెయిమ్ అయ్యేలా చేయాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు. 3) నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన ఫక్రుద్దిన్ గ్రామ పొలిమేర లో సర్వే నెంబర్ 581/1,584 లో 8 ఎకరాల పొలంలో 2024లో అకాల వర్షాల వల్ల మినుము పంట నాశనం అయినది పంట నమోదు ప్రక్రియ కూడా చేసినప్పటికీ సంబంధింత పంట నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో దాదాపు 290 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు.

# ఎమ్మెల్సీ అనంతబాబుకు ఉచ్చు

**కాకినాడ. ఏప్రిల్ 21 పెన్ పవర్:**
తన దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ను హత్య చేసి ఆపై డోర్ డెలివరీ చేసిన సంఘటన పై ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.. దీనిపై తమకు ఇంకా సరైన న్యాయం జరగలేదంటూ మృతుడి కుటుంబికులు ఎన్నికలకు ముందు చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై న్యాయ విచారణ చేపట్టి న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఈ సంఘటనపై న్యాయ విచారణకు ఆదేశించింది.. కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం రంపచోడవరంకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు.. చాలా కాలంగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం మానేశాడు.. ఇదిలా ఉంటే 2022 మే 19న ఇంటి నుంచి వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి రాలేదు. అయితే తెల్లవారు జామున ఓ కారులో గుర్తు తెలియని వ్యక్తి సుబ్రహ్మణ్యం మృతదేహం తీసుకొచ్చి వదిలి వెళ్లిపోయాడు. ఈ సంఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేకెత్తించింది. దళిత సంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి.. అయితే వైసీపీ ప్రభుత్వం నిందితున్ని కాపాడుతోందని ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి.. ఈక్రమంలోనే అత్యంత దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబు పై కాకినాడ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పట్లో పోలీసుల వైఖరిపై తీవ్రస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు ఎమ్మెల్సీ అనంతబాబును అరెస్ట్‌చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అలియాస్ అనంత బాబు డోర్ డెలివరీ కేసులో న్యాయ విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ న్యాయ విచారణలో ప్రాసిక్యూషన్ కు సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ మరియు మానవ హక్కుల రక్షణ కోసం సుదీర్ఘంగా పోరాటం



చేస్తున్న ముప్పాళ్ళ సుబ్బారావును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 538 ని విడుదల చేసింది. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ముప్పాళ్ళ సుబ్బారావు అండగా నిలిచారు. వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయస్థానాల్లో పోరాటం చేసేందుకు నేనున్నానంటూ నిలబడ్డారు. ముప్పాళ్ళ సుబ్బారావు మడమతిప్పని పోరాటం వల్ల ఎమ్మెల్సీ అనంత బాబుకు స్థానిక న్యాయస్థానాల్లో బెయిల్ లభించలేదు. చివరికి సుప్రీంకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం అనంత బాబు బెయిల్ పై ఉన్నారు. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితులు తప్పించుకునే విధంగా పోలీసులు చార్జిషీట్ రూపకల్పన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.. హత్య సంఘటన అనంతరం 88 రోజులకు దాఖలు చేసిన చార్జిషీట్‌ను అప్పట్లో న్యాయ స్థానం తిరస్కరించింది. అందులో సాంకేతి ఆధారాలు, నిందితుల కదలికలు తదితర అంశాలు లేకుండా చార్జిషీట్‌లో లేకపోవడమే తిరస్కరణకు కారణమని బాధితుల తరపున వాదించిన న్యాయవాది సుబ్బారావు వెల్లడించారు. 2023 ఏప్రిల్ 14న అనుబంధ చార్జిషీట్‌ను వేశారు. గడువులో దాఖలు చేయకుండా నిందితుడుకు బెయిల్ వచ్చేవిధంగా అప్పటి ఎస్పీ, డీఎస్పీ ఆలస్యం చేశారని విమర్శలున్నాయి.. అప్పట్లో తానే హత్యచేశానని విచారణలో ఎమ్మెల్సీ అనంతబాబు అంగీకరించినట్లు మీడియా సమావేశంలో ఎస్పీ వెల్లడించారు కూడా.. చార్జిషీట్ ఆలస్యం వల్లనే మధ్యంతర బెయిల్ వచ్చిందని దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే మృతుడి తల్లితండ్రులు నూకాలమ్మ,సత్యనారాయణలు మాత్రం మూడేళ్ళుగా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ కేసును రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం జరిగేలా విచారణకు ఆదేశిస్తారని భావిస్తూ వచ్చారు. సరిగ్గా ఇప్పుడు అదే జరిగింది. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో ప్రత్యేక కౌన్సిల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక న్యాయవాదిగా మంచి ట్రాక్ రికార్డు కలిగిన ముప్పాళ్ళ సుబ్బారావును ఈ కేసులో సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా నియమించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్సీ అనంత బాబు కేసులో న్యాయం గెలుస్తుందన్న నమ్మకం ఇప్పుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబంతో పాటు దళితుల్లోనూ కలుగుతోందంటున్నారు..

# కారుమూరి మెడకు 690 కోట్ల టీడీఆర్ స్కాం

**ఏలూరు. ఏప్రిల్ 21 పెన్ పవర్:**
ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఏలూరు జిల్లా వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన చేసిన హాట్ కామెంట్స్ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్నాయి. ఆయన చేసిన కామెంట్స్ కూటమి ప్రభుత్వంతో పాటు మళ్ళీ పాత కేసులను బయటకు తోడేలా చేసేయంటూ టాక్ విన్పిస్తోంది.ఇటీవల ఎంపీపీ ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు చేసిన వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో వైసిపిపై దాడులు చేస్తే మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు వరకు ఇంటి నుండి బయటకు లాగి కొడతామనీ, గుంటూరు తర్వాత నరికి చంపేస్తామని కారుమూరి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీలో పెను దుమారాన్నే రేపుతున్నాయి. ఈ కామెంట్స్ పై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కూటమి నేతలంతా తీవ్రంగా స్పందించారు. తణుకు నియోజవర్గంలో కొందరు టిడిపి నాయకులు కారుమూరి వల్ల తమకు ప్రాణహాని ఉందంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేశారు.ఎప్పుడు సైలెంట్ గా ఉండే కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సైతం కారుమూరి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసాపురంలో జరిగిన సభలో మాట్లాడుతూ%ఔ%రాజకీయ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్న హెచ్చరించిన వర్మ%ఔ%ఆ తర్వాత పాలకొల్లు నియోజకవర్గంలో జరిగిన సభలో మాత్రం కారుమూరిపై అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఎన్డీఏ కూటమి పార్టీల కార్యకర్తల జోలికి వస్తే చేతులు, కాళ్లు నరికేస్తానంటూ కేంద్రమంత్రి ఘాటుగా వ్యాఖ్యలు చేశారు.ఎవరినైనా చంపడానికి చేతులు లేకుండా, నడవడానికి కాళ్లు లేకుండా చేస్తానంటూ కారుమూరిని హెచ్చరించారు. %ణ=% బాండ్ల



స్కాంలో వందల కోట్లు అవినీతి చేసిన కారుమూరి నాగేశ్వరరావు త్వరలో జైలుకెళ్లడం ఖాయం అన్నారు. అయితే వర్మ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఇక కారుమూరి నాగేశ్వరరావు జైలుకి వెళ్లడం తప్పుదంటూ రకరకాల టాక్స్ పొలిటికల్ సర్కిల్స్ లో విన్పిస్తున్నాయి. నెక్స్ట్ లిస్టులో కారుమూరి పేరు ఉందంటూ ఇప్పుడు అంతా చర్చించుకుంటున్నారట.%ణ=% బాండ్ల స్కాంలో వందల కోట్లు అవినీతికి కారుమూరి పాల్పడ్డారంటూ కేంద్ర మంత్రి వర్మ చేసిన కామెంట్లు ఇప్పుడు హాట్ టాపిగ్గా మారాయి. టీడీఆర్ బాండ్ల స్కాంలో అసలేం జరిగిందంటూ ఇప్పుడు అంతా ఆరా తీస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కారుమూరి..తన సొంత నియోజకవర్గమైన తణుకు పట్టణంలో అభివృద్ధి పేరుతో భారీ ఎత్తున సేకరించిన భూములపై ప్రస్తుత తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ఆరా తీస్తున్నారంట.తణుకు మున్సిపాలిటీలో టీడీఆర్ బాండ్ల స్కాంపై ఇప్పటికే ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. వాస్తవానికి 2014 నుండి 19 వరకు అప్పటి తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ తణుకు పట్టణ అభివృద్ధి కోసం 6వేల గజాలకు బాండ్లు ఇచ్చారు. అయితే 2019 నుండి 24 వరకు అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావు ఏకంగా 6 లక్షల గజాల వరకూ బాండ్లు ఇవ్వడంతో తీగలాగితే డొంక కదిలింది అన్నట్లు రాష్ట్రంలోనే భారీగా టీడీఆర్ బాండ్స్ స్కాం బయటపడేందుకు కారణమైందట.ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇప్పటికే ఏసీబీ విచారణ పూర్తయిందని..త్వరలోనే నివేదికను ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందట. అయితే ఏసీబీ నివేదికలో కారుమూరి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే ఆయన జైలుకెళ్లడం తప్పదనే చర్చ జరుగుతోంది. అయితే ఏసీబీ సమర్పించే నివేదికలో ఏముందనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# పెద్దిరెడ్డికి టీడీపీ నేతల అండలు...?

**తిరుపతి, ఏప్రిల్ 21, పెన్ పవర్:**
ఏంటో వీళ్లు పట్టించుకోవడం లేదా.. లేక చేతకావడం లేదా.. లేక క్యాష్ కొట్టినోడిని క్షమించేస్తున్నారా.. ఇదే కూటమి ప్రభుత్వంపై ఆ పార్టీల కార్యకర్తలే విసురుతున్న మాటలు. మొదటి ఆరు నెలలు అయితే ఏకిపారేశారు. తర్వాత కాస్త కేసులు ఒక్కోరిపై పెడుతున్న కొద్దీ .. కొంచెం కొంచెం చల్లబడ్డారు. కాని ఆ కేసులు నడుస్తున్న తీరు చూసి మళ్లీ ఫైరవుతున్నారు. అదేమంటే టీడీపీ నేతలేమో మేం పద్ధతిగా వెళుతున్నాం.. వైసీపీలాగా అరాచకంగా, కక్షగట్టి చేయం అంటూ సుభాషితాలు చెబుతున్నారు. లేటెస్టుగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వ్యవహారంలో ప్రభుత్వంపై ఇలాంటి విమర్శలే వస్తున్నాయి.హైకోర్టు ముందస్తు బెయిల్ ఇస్తే.. సుప్రీంకోర్టులో కేవియెట్ ఎందుకు వేయలేదని.. అసలు బెయిల్ ఇచ్చే సమయంలో ప్రభుత్వం తరపు లాయర్ సరిగా వ్యవహరించలేదని.. సోషల్ మీడియాలో కూటమి కార్యకర్తల మధ్యే పెద్ద వార్ నడుస్తుంది. సమర్థించుకునేవారు కొందరు.. ప్రశ్నించేవారు మరికొందరు.. మొత్తం మీద రచ్చ నడుస్తోంది. ఇప్పుడు మిథున్ రెడ్డి లిక్కర్ స్కామ్ కేసులో విచారణకు హాజరవుతున్నారు. తన విచారణను లాయర్ల సమక్షంలో చేయాలని.. వీడియో రికార్డింగ్ చేయించాలని హైకోర్టులో పిటిషన్ వేశారు మిథున్ రెడ్డి. దీనిపై కూడా ప్రభుత్వం తరపు లాయర్లు సరిగా వాదించలేదనేదే విమర్శ. అసలు పెద్దిరెడ్డి ఫ్యామిలీతో కుమ్మక్కయ్యారా అంటూ సోషల్ మీడియాలో సర్క్యులేషన్ నడుస్తోంది.ఇక్కడ సమస్య ఏంటంటే%ఔ% కేసులు ఎదుర్కొంటున్న వైసీపీ పార్టీ నేతలంతా క్యాష్ పార్టీలే. మామూలు క్యాష్ పార్టీలు కాదు%ఔ% ఎవరిని కొట్టాలన్నా



క్యాష్ తోనే కొట్టే బ్యాచ్. క్యాష్ కొడితే దెబ్బ తగిలినా నవ్వుతూ తీసుకునే బాపతు మన వ్యవస్థలో చాలా ఎక్కువ మంది ఉన్నారు. పోలీసులు, లాయర్లు, అధికారులు.. అన్ని చోట్లా ఈ కల్చర్ ఉంది. బోరుగడ్డ అనిల్ విషయంలో అదే జరిగింది. పోలీసులు డబ్బులు తీసుకుని వాడికి రాచమర్యాదలు చేశారు.. ఆ వీడియోలు బయటకు రావడంతో జాగ్రత్తపడ్డారు. ఆఖరికి బోరుగడ్డ బెయిల్ కోసం పెట్టిన పేపర్లు కూడా ఫేక్ అని హైకోర్టు తేల్చింది కాని.. పోలీసులు కాదు.అంతెందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై భూకబ్జా ఆరోపణలు ఎన్ని వచ్చాయి? అటవీ భూములు, అసైన్డ్ భూములు ఆక్రమించినట్లు కంప్లయింట్లు చాలామంది చేశారు. మదనపల్లి తహశీల్దార్ ఆఫీసులో అగ్ని ప్రమాదం జరిగితే హెలికాప్టర్ లో అధికారులను పంపిన ప్రబుత్వం.. తర్వాత మాత్రం దాని గురించి పెద్దగా పట్టించుకున్నది. నెలల తర్వాత పెద్దిరెడ్డికి నోటీసులు ఇవ్వడానికి వెళ్లారు.. ఆయన లేరని వెనక్కి వచ్చేశారు. అలా నడుస్తోంది వ్యవహారం. అసలు భూములు ఆ రేంజులో కొట్టేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని.. అది కూడా ఆయన భార్య పేరు మీద డాక్యుమెంట్లు దొరికాక కూడా .. ఆయనను టచ్ చేయకపోవడం ఎలాంటి సిగ్నల్స్ ఇస్తుందని కొందరు ప్రశ్నిస్తున్నారుపెద్దిరెడ్డి కుటుంబం వరకు టీడీపీలోనే ఓ పెద్ద ఫ్రెండ్ ఉన్నాడన్నది చాలామందికి తెలుసు. ఆయనో టీడీపీ అనుకూల మీడియా అధినేత. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆయన చానెల్ లో పెద్దిరెడ్డిపై ఈగ వాలనివ్వలేదు. ఇక కూటమి వచ్చాక ఆయనను కాపాడే లాబీయింగ్ నడిపించారని ప్రచారం జరుగుతోంది. అయితే మరో పెద్ద టీడీపీ అనుకూల మీడియా ఈ విషయం తెలిసి%ఔ% పెద్దిరెడ్డిని టార్గెట్ చేసి వార్తలు వరుసగా ఇచ్చింది. దీంతో అందరూ అది ఇవ్వక తప్పలేదు.. ప్రభుత్వం, అధికారులు స్పందించక తప్పలేదు. కాని పెద్దిరెడ్డి ఫ్రెండ్ లాబీయింగ్ గట్టిగానే పని చేస్తున్నట్లు ఉంది. అందుకే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టచ్ చేయడం ఇంకా లేటు అవుతుంది.ఎందుకంటే ఈ స్కామ్ లో జగన్ ను అరెస్ట్ చేయడమే కూటమి ప్రభుత్వ టార్గెట్. అందుకే అలా జరుగుతోంది. లేదంటే మిథున్ రెడ్డిని కూడా పెద్దాయన రామచంద్రారెడ్డి కోరిక మేరకు వదిలేసేవారేమో. ఏమైనా క్యాష్ కొడితే ఎలాంటివాడినైనా వదిలేస్తారు అనే నానుడి మాత్రం కూటమి ప్రభుత్వంలో గట్టిగా వినిపిస్తోంది. కాకపోతే క్రిమినల్ కేసులు మాత్రమే దానికి మినహాయింపు. అందులోనూ కొందరు నేతలకు మాత్రమే ఆ మినహాయింపు. మరి తప్పు చేసిన వైసీపీ నేతలకు శిక్షలు వేయించి తన ప్రాతివత్యం టీడీపీ నిరూపించుకుంటుందో లేదో చూడాలి మరి

## ఏపీలో స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు

**విజయవాడ. ఏప్రిల్ 21 పెన్ పవర్:** రోడ్డుపై నడిచి వెళ్తున్నప్పుడూ లేదా వాహనాల్లో వెళ్తున్నప్పుడు రోడ్డుపక్కన వీధి వ్యాపారులను మనం గమనిస్తూనే ఉంటాం. తినుబండారాల దగ్గర నుంచి వస్తువుల వరకూ విక్రయిస్తూ ఉంటారు. పొట్టకూటి కోసం రహదారుల పక్కన, తోపుడు బండ్ల మీద చిరువ్యాపారులు.. తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ ఉంటారు. కూటి కోసం కోటి కష్టాలు అన్నట్లుగా వారి ఇబ్బందులు వారివి. అయితే వీధి వ్యాపారుల కారణంగా అప్పడప్పుడూ రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతూ ఉంటుంది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ నేపథ్యంలో వారి జీవనోపాధి దెబ్బతీయకుండా.. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు అమలు చేస్తోంది.పట్టణాల్లో రద్దీ నియంత్రించేందుకు, వీధి వ్యాపారులకు పరిశుభ్రమైన వ్యాపార పద్ధతులు అలవాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ 2013లో ఈ స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును ప్రారంభించింది. స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు కింద వీధి వ్యాపారులకు కంటైనర్ షాపులు నిర్మించి ఇవ్వనున్నారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 200 కంటైనర్ షాపులు నిర్మించి వీధి వ్యాపారులకు అందించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నెల్లూరు మైపాడు రోడ్డులో పైలట్ ప్రాజెక్టుగా స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇప్పుడు శ్రీకాకుళంలోని కొత్తవంతెన రహదారిలోవీధి వ్యాపారులకు కంటైనర్లు నిర్మించి ఇవ్వనున్నారు.పట్టణాలు, నగరాల్లో రోడ్ల పక్కన ఆహార పదార్థాలు, వ్యాపారాలు చేసేవారికి స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు కింద కంటైనర్లు కేటాయిస్తారు. 18 ఏళ్లు పైబడి ఉండాలి. అలాగే స్థానిక సంస్థలో వివరాలు నమోదు చేసుకుని ఉండాలి. అర్హులకు స్ట్రీట్ వెండర్స్ కమిటీ ద్వారా అందరి సమక్షంలోనే ఈ కంటైనర్ దుకాణాలు కేటాయిస్తారు. ఒకే రకమైన ఆహార పదార్థాలు, ఉత్పతులు విక్రయించేవారికి వీటిని కేటాయిస్తారు. ఈ కంటైనర్ దుకాణాలలో అవసరమైన అన్నిరకాల మౌలిక సదుపాయాలు, రూఫ్ టాప్ సీలింగ్, సోలార్ విద్యుత్తు, ఉచిత వైఫై, అధునాతన ఫర్నీచర్ ఉంటాయి. అలాగే ఆహార పదార్థాల తయారీ, మార్కెటింగ్‌పైనా ప్రత్యేక శిక్షణ అందిస్తారు.

## వేగంగా గిరిజన వర్శిటీ పనులు

**విజయనగరం. ఏప్రిల్ 21 పెన్ పవర్:** కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణం పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహకరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలసలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోంది. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.వీ. కట్టిమణి, డీన్ ప్రొఫెసర్ ఎం.శరత్ సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు, తాజా పరిస్థితులపై వారితో సీఎం చంద్రబాబు మాట్లాడారు.గిరిజన వర్సిటీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.800 కోట్లు కేటాయించింది. అందులో ఇదివరకే రూ.340 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. మొత్తం 561 ఎకరాల గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో అడ్మిన్ బిల్డింగ్‌తో పాటు వసతి భవనాలు, అకడమిక్ బ్లాక్స్ నిర్మాణం జరుగుతోంది. ఈ పనులు వేగవంతం చేయాలని వీసికి సీఎం చంద్రబాబు సూచించారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. నిర్మాణాల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వ పరంగా పూర్తిగా సహకరిస్తామని చంద్రబాబు వర్సిటీ వీసీకి చెప్పారు. యూనివర్సిటీకి తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, అప్రోచ్ రోడ్ పనులను త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వేగంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. వర్సిటీకి 2 కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్ పనులు పూర్తి చేయాలని వీసి చెప్పగా... ఆ పనులు వెంటనే ప్రారంభిస్తామని చంద్రబాబు అన్నారు. 100 మంది టీచింగ్ స్టాఫ్ అవసరం కాగా, ప్రస్తుతం కేవలం 18 మంది మాత్రమే ఉన్నారని అధికారులు తెలిపారు. సిబ్బందిని మరింత పెంచాల్సిందిగా కోరుతూ ప్రధాని మోదీకి లేఖ రాస్తానన్నారు సీఎం చంద్రబాబు. మే నెలలో నిర్వహించే యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రావాల్సిందిగా కోరుతూ ప్రధాని మోదీకికి లేఖ రాస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అయింది. అప్పటి నుంచి అద్దె భవనాల్లో విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వర్సిటీ నిర్మాణ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఏదీ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వర్సిటీ నిర్మాణంపై మరోసారి దృష్టిసారించింది. ప్రస్తుతం 600 మంది విద్యార్థులు వివిధ కోర్సులు చదువుతుండగా.. సొంత భవనాలు పూర్తయితే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఉద్యోగం సాధించేలా, నైపుణ్యం పెంచేలా బోధన ఉండేలా చూడాలని సీఎం చంద్రబాబు గిరిజన యూనివర్సిటీ అధికారులను కోరారు. ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా, ఉద్యోగాల సాధన దిశగా కోర్సులను అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## బీసీ సభలో ఓసీ నాయకుడు హవా

**విజయవాడ. ఏప్రిల్ 21 పెన్ పవర్:** సజ్జల ఈజ్ బ్యాక్.. అవును కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్న సజ్జల ఇప్పుడు మీడియా ముందుకొచ్చారు. ఆయన కమ్ బ్యాక్ కోసం వైసీపీ ఏకంగా ఓ సభ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ సభ బీసీలది. మరి బీసీ సభలో ఓసీ నాయకుడు సజ్జల ఎందుకు అనే అనుమానం అందరికీ రావడం కామన్. సభ బీసీలది అయినా వైసీపీలో బీసీల తరపున మాట్లాడే నాయకులెవరూ లేరని కాబోలు సజ్జలని తెరపైకి తెచ్చారు. ఆయనతోనే ఉపన్యాసం ఇప్పించారు. వైసీపీ బీసీల పార్టీ అని చెబుతూ.. బీసీలకు పెద్దగా మాట్లాడే ఛాన్స్ ఇవ్వకుండా సజ్జలే లీడ్ తీసుకోవడం ఇక్కడ విశేషం. దీంతో టీడీపీ నేతలు ఓ రేంజ్ లో ట్రోలింగ్ మొదలు పెట్టారు. వైసీపీలో బీసీ నేతల పరిస్థితి ఏంటో ఈ సభతోనే అర్థమైపోయిందని అంటున్నారు టీడీపీ నేతలు.ఇటీవల కొంతకాలంగా సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో కనపడ్డంలేదు. సహజంగా జగన్ ఎక్కడుంటే ఆయన కూడా అక్కడ ఉండాలి. కానీ ఆయన లేకుండానే జగన్ నాలుగైదు సార్లు జనంలోకి వచ్చారు. పార్టీ ఆఫీస్ లో కూడా మీటింగ్ లు జరిగాయి. సజ్జల లేకపోవడంతో చాలామందికి చాలా అనుమానాలొచ్చాయి కానీ, ఆయన ఇప్పుడు సడన్ ఎంట్రీ ఇవ్వడం విశేషం. ఇటీవల పొలిటికల్ అఫైర్స్ కమిటీ నాయకత్వం కూడా సజ్జలకే జగన్ అప్పగించడం మరో విశేషం. దీంతో జగన్ వద్ద ఆయన ప్రయారిటీ ఏమాత్రం తగ్గలేదని రుజువైంది.అధికారంలో ఉన్నప్పుడు సకల శాఖల మంత్రి అనే అపవాదు మోశారు సజ్జల. పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామందికి ఆయన టార్గెట్ అయ్యారు. కొందరు బయటపడి మాట్లాడేశారు, మరికొందరు సైలెంట్ గా ఉన్నారు. ఇంకొందరు ఏకంగా పార్టీ నుంచి బయటకొచ్చేసి కోటరీ అంటూ కేకలు వేశారు, కానీ ఫలితం లేదు. జగన్ మాత్రం సజ్జలపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. పార్టీ వ్యవహారాల్లో ఆయనకు పెద్దపీట వేశారు. ఇక తాజాగా బీసీ మీటింగ్ కూడా సజ్జల నేతృత్వంలోనే జరిగింది.వైసీపీ బీసీ సెల్ మీటింగ్ కి మాజీ మంత్రులు జోగి రమేష్, ధర్మాన కృష్ణదాస్, కారుమూరి నాగేశ్వరరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్ సహా అన్ని జిల్లాలనుంచి బీసీ నేతలు హాజరయ్యారు. అయితే కీలక ఉపన్యాయం మాత్రం సజ్జలదే. బీసీలంటే బ్యాక్ బోన్ క్యాస్ట్ అనే విషయాన్ని జగన్ నిరూపించారని అన్నారు సజ్జల. వైసీపీ నేతలు ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయాలని, పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని సూచించారు. గతంలో కంటే మెరుగ్గా పూర్తిస్థాయి కమిటీలను ఈసారి నియమించుకుందామని అన్నారాయన. విశాఖలో బీసీ మహిళను మేయర్ పీఠం నుంచి తప్పించారని విమర్శించారు.అంతా బాగానే ఉంది కానీ సజ్జల రీఎంట్రీ కోసం బీసీ మీటింగ్ ని ఎంచుకోవడం హాస్యాస్పదం అంటున్నారు టీడీపీ నేతలు. బీసీ పార్టీ అంటే టీడీపీయేనని, బీసీలకు అవకాశాలిచ్చి, నేతలుగా ఎదిగే తోడ్పాటునిచ్చింది, ఇస్తోంది కూడా టీడీపీయేనని చెప్పారు. బీసీల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని వారు కౌంటర్లిచ్చారు.

### స్ట్రాటజీ అంటే ఇదే మరి: ప్లే ఆఫ్స్‌కు చేరుకున్నా..

# మాకు ఇంకో లక్ష్యం ఉంది: ధోనీ





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో ఐదు సార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ కథ ముగిసినట్టే కనిపిస్తుంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ప్లే ఆఫ్స్ కు వెళ్లే అవకాశాలు లేవు. ఈ సీజన్ లో అత్యంత ఘోరంగా ఆడిన జట్లలో చెన్నై సూపర్ కింగ్స్ ఒకటి. తొలి మ్యాచ్ లో సొంతగడ్డపై గెలిచి గ్రాండ్ గా సీజన్ ను ఆరంభించినా ఆ తర్వాత వరుస పరాజయాలు ఆ జట్టును కృంగదీశాయి. దీనికి తోడు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరం కావడం వారికి అతి పెద్ద మైనస్. గైక్వాడ్ లేకపోవడంతో చెన్నై ప్రస్తుతం ధోనీ నడుస్తున్నాడు. ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ మొత్తం 8 మ్యాచ్ ల్లో ఆడితే రెండు విజయాలు మాత్రమే సాధించింది. ఒక జట్టు ఐపీఎల్ ప్లే ఆఫ్స్ కు సాధించాలంటే 8 మ్యాచ్ ల్లో విజయం తప్పనిసరి. 7 మ్యాచ్ లు గెలిచినా వెళ్లాలంటే అదృష్టం కలిసి రావాలి. చెన్నై ఈ సీజన్ లో మరో 6 మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఈ ఆరు మ్యాచ్ ల్లో గెలిస్తేనే ఆ జట్టు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధిస్తుంది. ఒక్క మ్యాచ్ ఓడిపోయినా టోర్నీ నుంచి 99 శాతం నిష్క్రమిస్తుంది. ఆదివారం (ఏప్రిల్ 20) ముంబై ఇండియన్స్ తో ఓడిపోయిన తర్వాత చెన్నైకి ఈ పరిస్థితి వచ్చింది. ఏకపక్షంగా జరిగిన ఈ మ్యాచ్ లో 177 పరుగుల లక్ష్యాన్ని ముంబై మరో 26 బంతులు మిగిలి ఉండగానే ఛేజ్ చేసింది. మ్యాచ్ తర్వాత ధోనీ మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేశాడు. " మొదట మా లక్ష్య ప్లే ఆఫ్స్ వెళ్లేందుకు ప్రయత్నించడం. ఒకవేళ ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించకపోతే.. వచ్చే సీజన్ కు మంచి ప్లేయింగ్ 11 తయారు చేయడం మీద దృష్టి పెడతాం". అని ధోనీ అన్నాడు. ధోనీ మాటలను బట్టి చూస్తే ఈ సీజన్ లో చెన్నై యంగ్ ప్లేయర్లకు ఎక్కువ అవకాశాలను ఇవ్వనున్నట్టు తెలుస్తుంది. ఆయుష్ మాత్రే, షేక్ రషీద్ ఆడిన తొలి మ్యాచ్ లో రాణించారు. వీరి మీద ఎక్కువ దృష్టి పెట్టి మంచి ప్లేయర్లుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయొచ్చు.

వాంఖడే వేదికగా ఆదివారం (ఏప్రిల్ 20) చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టింది. భారీ ఛేజింగ్ లో స్టార్ బ్యాటర్లు సూర్య కుమార్ యాదవ్(30 బంతుల్లో 68: 6 ఫోర్లు, 5 సిక్సర్లు), రోహిత్ శర్మ(45 బంతుల్లో 76: 6 సిక్సర్లు, 4 ఫోర్లు) చెలరేగడంతో ముంబై సునాయాస విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఛేజింగ్ లో ముంబై 15.4 ఓవర్లలో వికెట్ కోల్పోయి 177 పరుగులు చేసి గెలిచింది.

## ఆ ఒక్కడికే అన్యాయం: సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించిన ఐదుగురు క్రికెటర్లు వీరే!






**హైదరాబాద్ పెన్ పవర్:** 2024-25 సీజన్?కు గానూ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టుకు ఎంపికైన క్రికెటర్ల జాబితాను విడుదల చేసింది. కాంట్రాక్ట్ జాబితాలో మొత్తం 34 మంది ఆటగాళ్లను నాలుగు వేర్వేరు గ్రేడ్‌లుగా విభజించారు. ఈ సారి సెంట్రల్ కాంట్రాక్ట్ లో మొదటి సారి ఐదుగురు ఆటగాళ్లకు చోటు కల్పించిన బీసీసీఐ.. మరో ఐదుగురు క్రికెటర్లను ఈ లిస్ట్ నుంచి తొలగించింది. రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ , జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా.. గ్రేడ్ %ూ%ం కేటగిరిని నిలుపుకోగా..రిషబ్ పంత్ గ్రేడ్ బి నుంచి గ్రేడ్ ఏ కు ప్రమోట్ అయ్యాడు. గత ఏడాది సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి శ్రేయాస్ అయ్యర్, కిషాన్ లకు సెంట్రల్ కాంట్రాక్ట్ లో బీసీసీఐ చోటు కల్పించింది.

**సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తప్పించిన ఐదుగురు ఆటగాళ్లు వీరే:**

1) అవేష్ ఖాన్: టీమిండియా యంగ్ ఫాస్ట్ బౌలర్ అవేష్ ఖాన్ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తప్పించడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. టీమిండియా తరపున అవకాశం వచ్చిన ప్రతిసారి పర్వాలేదనిపిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ లోనూ ఆవేశ్ ఖాన్ అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ అతడి పేరును తొలగించడం దురదృష్టకరం. చివరిసారిగా 2024 నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్ లో టీమిండియా తరపున ఆడాడు. 2022లో అరంగేట్రం చేసిన ఆవేష్ ఖాన్.. ఇప్పటివరకు 8 వన్డేలు, 25 టీ20 మ్యాచ్ లాడాడు.

2) శార్దుల్ ఠాకూర్: శార్దూల్ ఠాకూర్ డిసెంబర్ 2023లో టీమిండియా తరపున చివరిసారిగా ఆడాడు.గాయం కారణంగా 2024 లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. గాయం నుంచి కోలుకొని రంజీ ట్రోఫీ ఆడిన శార్దూల్ తనకు తాను నిరూపించుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ లోనూ అద్భుతంగా రానిస్తున్నాడు. 2024 లో భారత్ తరపున ఒక్క మ్యాచ్ ఆడకపోవడం కారణంగానే ఈ ఆల్ రౌండర్ కు కాంట్రాక్ట్ లిస్ట్ లో చోటు దక్కించుకోలేకపోయాడు.

3) రవిచంద్రన్ అశ్విన్: డిసెంబర్ 2024లో బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టెస్ట్ తర్వాత భారత ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఒక ప్లేయర్ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత సెంట్రల్ కాంట్రాక్ట్ లో భాగం కాలేడు. ఈ కారణంగానే అశ్విన్ కాంట్రాక్ట్ జాబితా నుండి తొలగించబడ్డాడు.

4) జితేష్ శర్మ: జితేష్ శర్మ కాంట్రాక్ట్ జాబితా నుండి తొలగించబడటం ఊహించిందే. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ జనవరి 2024 నుంచి టీమిండియా తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. పేలవ ఫామ్ తో భారత జట్టులో స్థానం కోల్పోయాడు. ఇండియా తరపున జితేష్ ఇప్పటివరకు 9 టీ20 మ్యాచ్ లాడాడు. 5) కె.ఎస్. భారత్: టెస్ట్ జట్టులో స్థానం దక్కించుకున్న కె యస్ భరత్.. ఎన్ని అవకాశాలొచ్చినా ఒక్కసారి కూడా రాణించలేకపోయాడు. దీంతో భారత జట్టులో స్థానం కోల్పోవడంతో పాటు సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి అతనికి ఉద్వాసన పలికారు. రిషబ్ పంత్, ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్లుగా అందుబాటులో ఉండడంతో భరత్‌ను కాంట్రాక్ట్ జాబితా నుండి పూర్తిగా తొలగించారు.

## ఆ రెండు జట్లకు చావో రేవో.. ఒక్క మ్యాచ్ ఓడినా ఇంటికే





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 ప్రారంభమై ఆదివారం (ఏప్రిల్ 20)తో నెల రోజులైంది. అన్ని జట్లు ఇప్పటివరకు సగం మ్యాచ్ లు ఆడేశాయి. ప్లే ఆఫ్ కు వెళ్లే జట్లేవో.. టోర్నీ నుంచి నిష్క్రమించే జట్లేవో క్లారిటీ వచ్చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జయింట్స్ జట్లు ప్లే ఆఫ్ రేస్ లో దూసుకెళ్తున్నాయి. ఢిల్లీ, గుజరాత్ ఆడిన 7 మ్యాచ్ ల్లో 5 మ్యాచ్ లు గెలిస్తే.. బెంగళూరు, పంజాబ్, లక్నో ఆడిన 8 మ్యాచ్ ల్లో 5 మ్యాచ్ లు గెలిచాయి. ఈ ఐదు జట్లు మరో మూడు మ్యాచ్ లు గెలిచినా రాయల్ గా ప్లే ఆఫ్ లోకి అడుగుపెడతాయి. కోల్ కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్ కు వెళ్లాలంటే తీవ్రంగా శ్రమించాల్సిందే. కోల్ కతా మిగిలిన 7 మ్యాచ్ ల్లో 5 విజయాలు సాధించాలి. ఇక ముంబై మిగిలిన 6 మ్యాచ్ ల్లో 4 గెలవాలి. సన్ రైజర్స్ హైదరాబాద్ డేంజర్ జోన్ లో ఉంది. కమ్మిన్స్ సేన ఆడిన 8 మ్యాచ్ ల్లో 3 మాత్రమే గెలిచింది. ఆ జట్టు ప్లే ఆఫ్ కు సాధించాలంటే మిగిలిన 6 మ్యాచ్ ల్లో 5 మ్యాచ్ లు తప్పకుండా గెలిచి తీరాల్సిందే. అన్నిటికంటే దారుణమైన పరిస్థితిలో మాజీ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఉన్నాయి. ఈ రెండు జట్లు కూడా ఆడిన 8 మ్యాచ్ ల్లో కేవలం రెండు మ్యాచ్ లు మాత్రమే గెలిచి టోర్నీ నుంచి నిష్క్రమించే దశలో ఉన్నాయి. చెన్నై, రాజస్థాన్ మిగిలిన 6 మ్యాచ్ ల్లో తప్పకుండా గెలిస్తేనే ప్లే ఆఫ్స్ కు చేరతాయి. ఒక్క మ్యాచ్ ఓడిపోయినా ఇంటి దారి పట్టడం ఖాయం. ఈ రెండు జట్లకు ప్రస్తుతం నెట్ రన్ రేట్ కూడా మైనస్ ల్లో ఉంది. దీంతో తర్వాత ఆడబోయే మ్యాచ్ ల్లో భారీగా గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజస్థాన్ గురువారం (ఏప్రిల్ 24) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడాల్సి ఉంది. టోర్నీలో నిలవాలంటే ఈ మ్యాచ్ లో గెలుపు తప్పనిసరి. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ శుక్రవారం (ఏప్రిల్ 25) సన్ రైజర్స్ హైదరాబాద్ తో తలపడుతుంది. చెన్నై ఈ మ్యాచ్ లో ఓడితే టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

# ట్రెండీ లుక్‌తో అనసూయ అరాచకం!

మొదట టెలివిజన్ రంగంలో గుర్తింపు అందుకుని ఆ తరువాత బిగ్ స్క్రీన్‌పై తనదైన ముద్ర వేసుకున్న నటి అనసూయ భరద్వాజ్. ఆమె టాలెంట్ అందం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. యాంకర్‌గా ఉన్నప్పుడు హ్యూమర్‌తో ఆకట్టుకుంది. తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' లాంటి సినిమాలతో నటిగా ట్రాన్సిషన్ అద్భుతంగా చేసుకుంది. ముఖ్యంగా పుష్పలో 'దాక్షయణి' పాత్ర ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది.ఇక లేటెస్ట్ గా అనసూయ చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బ్లాక్ టాప్, స్కై బ్లూ స్కర్ట్‌లో ఓ మోడ్రన్ లుక్‌తో మెరిసిపోతున్న అనసూయ స్టైలిష్ గా దర్శనమిచ్చింది. జస్ట్ క్లాసిక్ లుక్ అని చెప్పుకోవచ్చు. మెటాలిక్ ఫాబ్రిక్ టచ్, జిప్ డిజైన్ విత్ స్లీవ్‌లెస్ స్టైల్‌తో ఈ డ్రెస్సింగ్ మోడర్న్ యూత్‌కు తెగ నచ్చేసినట్లు లైక్స్ చూస్తేనే అర్థమవుతుంది.ఫోటోల్లో ఆమె ఎక్స్‌ప్రెషన్స్ మూడ్స్‌ను బాగా క్యాచ్ చేస్తూ కనిపించాయి. ఒక్కో పోజ్‌కి వేరే వేరే మూడ్‌ను చూపించగలిగిన అనసూయ ప్రొఫెషనల్ యాక్ట్రెస్‌గా ఎంత అభివృద్ధి చెందినదో స్పష్టంగా తెలుస్తోంది. ఆమె కళ్లలో కనిపిస్తున్న కాన్ఫిడెన్స్, కెమెరా ఫ్రెండ్లీ నేచర్ అన్నీ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. ఈ ఫోటోలకు భారీ లైక్స్ వస్తుండగా, అభిమానులు కామెంట్స్‌లో "కిల్లర్ లుక్", "ఎటిట్యూడ్ క్వీన్", "బోల్డ్ అండ్ బ్యూటిఫుల్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌కి ఫ్యాషన్ ట్రెండ్ చెప్పేలా అనసూయ ఈ ఫోటోషూట్‌లో నలుగురికీ ప్రేరణగా నిలుస్తోంది. ప్రస్తుతం స్టార్ మా ఛానెల్‌లో ప్రసారమవుతోన్న 'కిరాక్ బాయ్స్ అండ్ ఖిలాడీ గర్ల్స్ 2' షోకి అనసూయ యాంకర్‌గా వ్యవహరిస్తోంది. ఈ షోలో ఆమె హోస్టింగ్ స్టైల్‌తో పాటు ఈ విధమైన ఫోటోషూట్స్‌తో మరింత ఫాలోయింగ్ పెంచుకుంటోంది. కెరీర్‌లోనే కాకుండా స్టైల్ లోనూ అనసూయ ఎప్పటికీ ట్రెండింగ్‌లోనే ఉంటుంది అనడానికి ఈ ఫోటోలు నిదర్శనం.



తమన్నా భాటియా గ్లామర్‌ని పునర్నిర్వచించింది



మేఘ చంద్ర పాత్రలో కోమలీ ప్రసాద్ యొక్క స్టైలిష్ అవతార్‌లు తప్పవు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com